# హైదరాబాద్ పల్స్

జాతీయ తెలుగు దినపత్రిక

దేశం ముఖ్యం.... దేశ ప్రజల భద్రత ముఖ్యం.... మతం కాదు...

epaper.hyderabadpulsenews.in



విలేకరులు కావలెను

హైదరాబాద్ పల్స్ జాతీయ తెలుగు దినపత్రిక

"ఎంతకైనా తెగిస్తాం... ప్రజల గొంతుకై నిలుస్తాం" అనే నినాదంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రారంభించిన హైదరాబాడ్ పల్స్ జాతీయ దినపత్రికకు తెలుగు రాష్ట్రాలలోని అన్ని మండల, నియోజకవర్గాల, జిల్లాల వ్యాప్తంగా విలేకరులు కావలెను. * సీనియర్లకు ప్రాధాన్యత కలదు.

సంప్రదించవలసిన ఫోన్ నెంబర్స్

- Dr. RAHUL KUMAR 9989834020

- K. Naveen Kumar 94406 53413

www.hyderabadpulse.com HyderabadPulse @hyderabad



సీఈఓ : కె నవీన్ కుమార్ | ఎడిటర్: డా. రాహుల్ కుమార్ | సంపుటి: 03 | సంచిక : 140 | పేజీలు : 08 | గురువారం | 28-05-2026 | వెల :4/-

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD, SANGAREDDY, WARANGAL, MANCHIRYAL, VIJAYWADA, GUNTUR, KURNOOL, TIRUPATI, KADAPA, BENGALURU, MUMBAI, CHENNAI, DELHI.


# గ్రీన్ సిగ్నల్!..

**ఓటరు జాబితా ప్రత్యేక సవరణకు సుప్రీంకోర్టు గ్రీన్ సిగ్నల్!**

- ఓటరు జాబితాల ప్రత్యేక సవరణ చట్టబద్ధం
- ఎన్నికల సంఘం నిర్ణయాన్ని సమర్థించిన సుప్రీంకోర్టు
- మే 30 నుంచి ఆఖరి విడత ప్రక్రియ
- నిబంధనల ప్రకారమే ఈసీ చర్యలని స్పష్టీకరణ
- విపక్షాల అభ్యంతరాలకు బ్రేక్ వేసిన తీర్పు



ఎన్నికల సంఘం చేపట్టిన ఓటరు జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ చట్టబద్ధమేనని సుప్రీంకోర్టు బుధవారం సంచలన తీర్పునిచ్చింది. సాధారణ సవరణ విధానానికి భిన్నంగా

2

## అలా చేస్తే ఎన్నికల నుంచి తప్పుకుంటారా?



2

హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

ఇందిరమ్మ ఇళ్లపై బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌కు, తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో కేటీఆర్‌కు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి బుధవారం హైదరాబాద్‌లో సవాల్ విసిరారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో నిర్మించిన ఇళ్ల కంటే ఎక్కువ కడితేనే తాను వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తానని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. లేదంటే ఎమ్మెల్యేగా కూడా పోటీ చేయనని పేర్కొన్నారు. మీకంటే ఎక్కువ ఇళ్లు నిర్మిస్తే.. మీరు పోటీకి దూరంగా ఉంటారా? అంటూ కేటీఆర్‌ను పొంగులేటి శ్రీనివాసరెడ్డి

# చర్చించేందుకు సిద్ధం

మహారాష్ట్ర సీఎంకు రేవంత్‌రెడ్డి లేఖ

తుమ్మిడిహట్టి బ్యారేజీపై మహారాష్ట్ర సీఎంకు రేవంత్‌రెడ్డి లేఖ

తుమ్మిడిహట్టిపై మహారాష్ట్రతో చర్చించేందుకు సిద్ధమని సీఎం లేఖ

తెలంగాణ ప్రతినిధులకు మహారాష్ట్ర సమయం ఇవ్వాలని కోరిన సీఎం




హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

తుమ్మిడిహెట్టి బ్యారేజ్ ఎత్తు, నిర్మాణంపై మహారాష్ట్రతో చర్చించేందుకు తెలంగాణ ప్రభుత్వం అడుగు ముందుకేసింది. ఈ మేరకు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌కు లేఖ రాశారు. తెలంగాణ ప్రభుత్వ ప్రతినిధి బృందంతో సమావేశానికి సమయమివ్వాలని, అనుకూలమైన తేదీని త్వరగా ఖరారు చేయాలని రేవంత్ కోరారు.

**తెలంగాణకు నీళ్లొస్తాయి**

తుమ్మిడిహట్టి ఎత్తుపై మహారాష్ట్రతో చర్చించాల్సిన అవసరం ఉందన్న సీఎం రేవంత్ రెడ్డి గతంలో 148 మీటర్ల ఎఫ్ఆర్ఎల్‌కు మహారాష్ట్ర ప్రభుత్వం అంగీకరించిందని గుర్తు చేశారు. 148 మీటర్ల ఎఫ్ఆర్ఎల్ వల్ల ఉత్తర తెలంగాణ నీటి అవసరాలు తీరవని తెలిపారు. ఎఫ్ఆర్ఎల్ పెరిగితే గ్రావిటీ ద్వారా తెలంగాణకు నీళ్లొస్తాయని, ఎఫ్ఆర్ఎల్ పెంచినా మహారాష్ట్రలో ముంపు ప్రభావం తక్కువేనని రేవంత్ లేఖలో పేర్కొన్నారు.

## కస్టడీలోకి తీసుకున్న పోలీసులు



- బండి భగీరథ్ ను జైలు నుంచి కస్టడీలోకి తీసుకున్న పోలీసులు
- మైనర్ బాలికను లైంగికంగా వేధించాడంటూ కేసు
- చర్లపల్లి జైలు నుంచి భగీరథ్ ను కస్టడీలోకి తీసుకున్న పోలీసులు
- కూకట్‌పల్లి డీసీపీ పర్యవేక్షణలో జరుగుతున్న విచారణ

2

## భావోద్వేగాలతో ఇరికించొద్దు



**అత్తామామలు మౌనంగా ఉన్నారని వేధింపుల కేసు కుదరదు: సుప్రీంకోర్టు**

- నైతికంగా తప్పైనా దాన్ని క్రిమినల్ నేరంగా పరిగణించలేం
- భర్త కుటుంబంపై సాధారణ ఆరోపణలను తోసిపుచ్చిన కోర్టు
- మధ్యప్రదేశ్‌కు చెందిన ఓ వరకట్న వేధింపుల కేసు కొట్టివేత
- వివాహ వివాదాలపై కోర్టులు మరింత జాగ్రత్తగా ఉండాలని సూచన
- నేరంలో ప్రత్యక్ష భాగస్వామ్యం ఉంటేనే చట్టపరమైన చర్యలు

2

## ప్రధాని మోదీతో సీఎం విజయ్ భేటీ

- ముఖ్యమంత్రి అయ్యాక తొలిసారి
- మోదీతో విజయ్ భేటీ
- తమిళనాడుకు మౌలిక, సంక్షేమ పథకాలకు, ప్రాజెక్టులకు నిధులు ఇవ్వాలని విజ్ఞప్తి



2

హైదరాబాద్ పల్స్,డెస్క్

తమిళనాడు ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ చంద్రశేఖర్ బుధవారం ప్రధాని మోదీని మర్యాదపూర్వకంగా కలిశారు. విజయ్ ముఖ్యమంత్రి అయిన తర్వాత ప్రధానిని కలవడం ఇదే మొదటిసారి కావడం గమనార్హం. ఈ భేటీ సందర్భంగా ఇరువురు నేతలు పలు కీలక విషయాలపై చర్చలు జరిపారు. ముఖ్యంగా 'మేకెదాటు డ్యామ్' ప్రాజెక్టు, తమిళ మత్స్యకారుల అరెస్టుల గురించి విజయ్ మోదీతో మాట్లాడారు.ప్రభుత్వ అధికారిక ప్రకటన ప్రకారం,

## రోగితో లైంగిక సంబంధం...

**బ్రిటన్ లో భారత సంతతి న్యూరోసర్జన్ పై వేటు**

- యూకేలో భారత సంతతి వైద్యుడిపై 8 నెలల సస్పెన్షన్
- మహిళా రోగితో లైంగిక సంబంధం పెట్టుకున్న వైనం
- నిబంధనలకు విరుద్ధంగా మత్తు మందులు సూచించినట్లు ఆరోపణలు
- వృత్తిపరమైన హద్దులు మీరినట్లు నిర్ధారించిన వైద్య ట్రిబ్యునల్
- అరుదైన నైపుణ్యాల కారణంగా పూర్తి నిషేధం నుంచి మినహాయింపు

2



హైదరాబాద్ పల్స్,డెస్క్

యూకేలో భారత సంతతికి చెందిన ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ చిరాగ్ పటేల్‌పై అక్కడి మెడికల్ ప్రాక్టీషనర్స్ ట్రైబ్యునల్ సర్వీస్ 8 నెలల



2

## వర్షాలు కురిసే అవకాశం

- రాగల నాలుగైదు రోజుల పాటు అకాల వర్షాలు
- ఉరుములు మెరుపులు ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం
- పలు
- ఆరెంజ్‌హెచ్చరికలను జారీ..ఉష్ణోగ్రతల్లో పెద్దగా మార్పు ఉండదని స్పష్టం

హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రంలో కొద్ది రోజుల నుంచి పగటి పూట భానుడు నిప్పులు కురిపిస్తున్నాడు. సాయంత్ర సమయంతో మాత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కాస్త ఉపసమనాన్ని కలిగిస్తున్నాయి. దీంతో రాష్ట్రంలో విభిన్న వాతావరణ పరిస్థితులు నెలకొంటున్నాయి. ఒక వైపు మండుతున్న ఎండల వల్ల ప్రజలు వడదెబ్బకు గురవుతుంటే, మరోవైపు అకాల వర్షాల కారణంగా చేతికి వచ్చిన పంటలు నేలపాలై రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. దీంతో వాతావరణం పరిస్థితులు ఎలా ఉండనున్నాయో అని రైతులు, ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం

## తెలంగాణలో భారీగా ఎమ్మార్వోల బదిలీ


## చంద్రబాబును ఎదుర్కోవాలి..

**ప్రతిచోటా వైసీపీ జెండా ఎగరాలి**

**స్థానిక ఎన్నికలపై జగన్ ఫోకస్**

- స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని పార్టీ శ్రేణులకు జగన్ పిలుపు
- ఏకగ్రీవ ఎన్నిక జరిగితే నియోజకవర్గ ఇంఛార్జి వైఫల్యంగా పరిగణిస్తానని హెచ్చరిక
- ప్రభుత్వ వైఫల్యాలపై 'వెన్నుపోటు రెండేళ్లు' బుక్‌లెట్‌ను ఇంటింటా పంచాలని ఆదేశం
- ఎస్సీలు బలంగా ఉన్నచోట వారినే అభ్యర్థులుగా నిలపాలని సూచన
- ప్రతిచోటా పోటీ చేసి వైసీపీ జెండా ఎగరేయాలని నేతలకు దిశానిర్దేశం

2



హైదరాబాద్ పల్స్,డెస్క్

ఏపీలో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలపై వైసీపీ అధినేత జగన్ పూర్తిస్థాయిలో దృష్టి సారించారు. ఎన్నికలకు పార్టీ యంత్రాంగాన్ని సమాయత్తం చేసే



## 'మహానాడు' 'దగానాడు'

- టీడీపీ మహానాడుపై రోజా తీవ్ర విమర్శలు
- 'మహానాడు'ను 'దగానాడు'గా అభివర్ణించిన రోజా
- అక్రమ కేసులతో వైసీపీ నేతలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని మండిపాటు
- సూపర్ సిక్స్ పథకాలు సూపర్ హిట్ ఎలా అయ్యాయో చెప్పాలని డిమాండ్

2

## న్యాయవాది మొయినుద్దీన్ హత్యకేసులో కీలక పరిణామం




2

# గ్రీన్ సిగ్నల్!..

మొదటి పేజీ రుచాయి

ఉందనే ఒకే ఒక్క కారణంతో ఈ ప్రత్యేక ప్రక్రియను రద్దు చేయలేమని స్పష్టం చేసింది. మే 30 నుంచి దేశవ్యాప్తంగా మూడో విడత సవరణలు ప్రారంభం కానున్న తరుణంలో అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన ఈ తీర్పు ప్రాధాన్యం సంతరించుకుంది.

**ఈసీ అధికారాలపై కోర్టు ముద్ర**

చీఫ్ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాల్యా బాగ్చీలతో కూడిన ధర్మాసనం ఈ కీలక తీర్పును వెలువరించింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 326తో పాటు 1950 ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం ఈ తరహా ప్రత్యేక సవరణలు చేపట్టే అధికారం ఎన్నికల సంఘానికి ఉందని కోర్టు స్పష్టం చేసింది. ఈ ప్రత్యేక సవరణ ద్వారా ఓటరు జాబితా పారదర్శకతను పెంచొచ్చని, ఇది రాజ్యాంగం నిర్దేశించిన ఉచిత, పక్షపాతరహిత ఎన్నికల లక్ష్యానికి లోబడే ఉందని ధర్మాసనం వ్యాఖ్యానించింది.

**చట్టాలకు లోబడే ప్రక్రియ**

ఈ ప్రత్యేక సవరణ ప్రక్రియ ప్రస్తుతం ఉన్న ఎన్నికల చట్టాలను ఎక్కడా అతిక్రమించడం లేదని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 21(3) పరిధిలోనే ఎన్నికల సంఘం తన విధులను నిర్వర్తించిందని, అందువల్ల అధికారులు తమ పరిధి దాటి ప్రవర్తించారని చెప్పలేమని కోర్టు తేల్చిచెప్పింది. తొలుత బిహార్‌లో ప్రారంభమైన ఈ విధానాన్ని ఆ తర్వాత ఎన్నికల సంఘం ఇతర రాష్ట్రాలకు కూడా విస్తరింపజేసింది.

**ప్రతిపక్షాల ఆరోపణలకు బ్రేక్**

కొన్ని నెలలుగా ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై ఎన్నికల సంఘానికి, ప్రతిపక్ష పార్టీలకు మధ్య తీవ్ర స్థాయిలో వివాదం నడుస్తోంది. ఈ సవరణల వల్ల అర్హులైన ఓటర్ల పేర్లు తొలగిపోతున్నాయని విపక్షాలు ఆరోపిస్తూ వచ్చాయి. అయితే తాజాగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో ఈ వివాదానికి తెరపడినట్లయింది. మే 30 నుంచి 16 రాష్ట్రాలు, మూడు కేంద్రపాలిత ప్రాంతాల్లో చివరి విడత ఓటరు వెరిఫికేషన్ ప్రక్రియ యథావిధిగా సాగనుంది.

# చంద్రబాబును ఎదుర్కోవాలి..

మొదటి పేజీ రుచాయి

క్రమంలో నియోజకవర్గ ఇంఛార్జిలకు ఆయన తీవ్ర హెచ్చరిక జారీ చేశారు. ఏ నియోజకవర్గంలోనైనా, ఏ ఒక్క స్థానంలోనైనా ఎన్నిక ఏకగ్రీవమైతే, దానిని పూర్తిగా ఆ ఇంఛార్జి వైఫల్యంగానే పరిగణిస్తానని తేల్చిచెప్పారు. తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ ముఖ్య నేతలు, సమన్వయకర్తలు, ఇంఛార్జిలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో జగన్ కీలక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అధికార పార్టీ కుట్రలను ఎదుర్కొని ప్రతిచోటా వైసీపీ జెండా ఎగరేయాలని పిలుపునిచ్చారు. "ఎన్ని కుట్రలు చేసినా, ఎన్ని ఇబ్బందులు పెట్టినా కూడా స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతిచోటా వైసీపీ జెండా ఎగరేయాలి. ఎక్కడైనా ఏకగ్రీవం జరిగిందంటే మాత్రం నేను చాలా సీరియస్‌గా తీసుకుంటా. ఇది మళ్లీ మళ్లీ చెబుతున్నా. అలా జరిగితే అది నియోజకవర్గ ఇంఛార్జి ఫెయిల్యూర్‌గానే భావిస్తా" అని జగన్ స్పష్టం చేశారు. అభ్యర్థుల ఎంపిక, వారికి ఇవ్వాల్సిన భరోసాపై కూడా జగన్ దిశానిర్దేశం చేశారు. ముఖ్యంగా ఎస్సీలు బలంగా ఉన్న గ్రామాల్లో వారి నుంచే అభ్యర్థులను ఎంపిక చేయాలని సూచించారు. పోటీ చేసే అభ్యర్థులకు పార్టీ, ఇంఛార్జి అండగా ఉన్నారనే ధైర్యాన్ని కల్పించాలని, అలా చేస్తేనే అసెంబ్లీ ఎన్నికల్లో వారు మనకు అండగా నిలుస్తారని వివరించారు. పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనే వారిని గుర్తించి, ఎన్నికల బరిలోకి దింపాలని ఆదేశించారు. చంద్రబాబు ప్రభుత్వ పాలనా వైఫల్యాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని జగన్ నేతలకు సూచించారు. ఇందుకోసం 'వెన్నుపోటు రెండేళ్లు' పేరుతో రూపొందించిన బుక్‌లెట్‌ను ప్రతి ఇంటికీ చేరవేయాలని ఆదేశించారు. ప్రభుత్వ లోపాలపై ఇంటింటా చర్చ జరిగేలా చేయడం ద్వారా ప్రజలే ప్రభుత్వానికి వ్యతిరేకంగా తిరగబడతారని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ ప్రచార కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహించాలని నేతలకు స్పష్టం చేశారు.

# అలా చేస్తే ఎన్నికల నుంచి తప్పుకుంటారా?

మొదటి పేజీ రుచాయి

సవాల్ విసిరారు. వీరిద్దరి మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. తెలంగాణ రాజధాని హైదరాబాద్ మహానగరంలో ఒక్క ఇందిరమ్మ ఇల్లు కట్టినట్లు నిరూపించానా.. తాను రాజకీయ సన్యాసం తీసుకుంటానని ఇప్పటికే కాంగ్రెస్ ప్రభుత్వానికి బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్ సవాల్ విసిరారు. ఈ సవాల్‌పై మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ట్విట్టర్ వేదికా స్పందించారు. మే 23వ తేదీన సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశంలో హైదరాబాద్‌లోని మూడు కార్పొరేషన్ల పరిధిలో లక్ష ఇందిరమ్మ ఇళ్లు నిర్మించాలని నిర్ణయించినట్లు తెలిపారు. అధికారంలోకి వచ్చిన తొలి రెండున్నర ఏళ్లలోనే రాష్ట్రంలో 4.5 లక్షల ఇళ్లు నిర్మిస్తున్నామన్నారు. ఇందిరమ్మ పాలన అంటే ఏమిటో గ్రామాల్లోకి వెళ్లి ఆ ఇళ్లు కట్టుకున్న కుటుంబాలను అడిగితే తెలుస్తుందని కేటీఆర్‌కు ఆయన స్పష్టం చేశారు. ఫామ్‌హౌస్‌లలో ఉంటే ఏం తెలుస్తుందంటూ కేటీఆర్‌కు మంత్రి పొంగులేటి చురకలంటించారు. అలాగే జూన్ 1వ తేదీన మరో 2.5 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు సీఎం రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టనున్నారని వివరించారు. అసెంబ్లీ ఎన్నికల నుంచి నిన్న మొన్నటి వరకు జరిగిన ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సత్తా చాటిందని కేటీఆర్‌కు పొంగులేటి గుర్తు చేశారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు వీఆర్ఎస్ ఇచ్చేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని కేటీఆర్‌కు పొంగులేటి స్పష్టం చేశారు. దాంతో మీరు ప్రత్యేకంగా రాజకీయ సన్యానం తీసుకోనక్కర్లేదంటూ కేటీఆర్‌కు మంత్రి పొంగులేటి వ్యంగ్యంగా అన్నారు.

# తెలంగాణలో భారీగా ఎమ్మార్వోల బదిలీ

మొదటి పేజీ రుచాయి

హైదరాబాద్, మే 27: రాష్ట్రంలో భారీగా తహసీల్దార్లు (ఎమ్మార్వోలు) బదిలీ అయ్యారు. 12 మంది తహసీల్దార్లను బదిలీ చేస్తూ రెవెన్యూ శాఖ కార్యదర్శి డీఎస్ లోకేష్ కుమార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. పరిపాలనా అవసరాల దృష్ట్యా ఈ బదిలీలు జరిగాయని జారీ చేసిన ఉత్తర్వుల్లో ఆయన స్పష్టం చేశారు. నిర్మల్‌కి చెందిన ఏ. మోతీరాంను మంచిర్యాల డీఆర్వోగా పోస్టింగ్ ఇచ్చారు. కరీంనగర్‌కి చెందిన బి. రాజేశ్వరికి పెద్దపల్లి డీఆర్వో బాధ్యతలు అప్పగించారు. పెద్దపల్లికి చెందిన కె.వై.ప్రసాద్‌ను జగిత్యాల డీఆర్వోగా నియమించారు. వనపర్తికి చెందిన ఆర్. పాండును నాగర్‌కర్నూల్ డీఆర్వోగా బదిలీ చేశారు. ఖమ్మంకి చెందిన వి. రవి కుమార్‌ను ములుగు డీఆర్వోగా పోస్టింగ్ ఇచ్చారు. మేడ్చల్-మల్కాజిగిరి జె.స్వామికి కరీంనగర్ డీఆర్వోగా బాధ్యతలు అప్పగించారు. నాగర్‌కర్నూల్‌కి చెందిన ఎ. పాండుకు కామారెడ్డి డీఆర్వోగా పోస్టింగ్ ఇచ్చారు. జనగాంకి చెందిన సీహెచ్ శ్రీకాంత్‌కు మహబూబ్‌నగర్ స్పెషల్ కలెక్టర్ పీఏగా నియామించారు. సూర్యాపేటకి చెందిన ఎం. సుదర్శన్ రెడ్డికి సిద్ధిపేట ఎస్‌డీసీ(ఎల్‌ఏ)గా బాధ్యతలు అప్పగించారు. ఖమ్మం ఎం. రామదేవికి నల్గొండ ఎస్‌డీసీ(ఎల్‌ఏ) పోస్టింగ్‌పెద్దపల్లి జి. కుమారస్వామికి సిరిసిల్ల ఎస్‌డీసీ(ఎల్‌ఏ) బాధ్యతలు. కరీంనగర్ ఎన్. వెంకట్ రెడ్డికి కరీంనగర్ ఎస్‌డీసీ(ఎల్‌ఏ)గా నియామకం.

# కస్టడీలోకి తీసుకున్న పోలీసులు

మొదటి పేజీ రుచాయి

తెలంగాణ రాజకీయాల్లో సంచలనం సృష్టించిన పోక్సో కేసు నిందితుడు బండి భగీరథ్ ను పోలీసులు కస్టడీలోకి తీసుకున్నారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌ను మేడ్చల్ మల్కాజిగిరి కోర్టు ఆదేశాల మేరకు పోలీసులు ఈరోజు ఉదయం కస్టడీలోకి తీసుకున్నారు. ఈ కేసులో మరింత లోతుగా విచారణ జరిపి, మరిన్ని కీలక వివరాలు రాబట్టేందుకు పేట్ బషీరాబాద్ పోలీసులు కోర్టును ఆశ్రయించగా... న్యాయస్థానం మూడు రోజుల పోలీస్ కస్టడీకి అనుమతి ఇచ్చింది.

**ముగిసిన బండి భగీరథ్ విచారణ :** అరణ్య ఫామ్‌హౌస్?లో సీన్ రీకన్‌స్ట్రక్షన్ అనంతరం బండి భగీరథ్‌నుకూకట్‌పల్లి డీసీపీ కార్యాలయానికి తీసుకొచ్చారు. కూకట్‌పల్లి డీసీపీ ఆధ్వర్యంలో తొలిరోజు భగీరథ్‌ను విచారించారు. అనంతరం పేట్‌బషీరాబాద్ పీఎస్‌కు బండి భగీరథ్‌ను తరలించారు. మరో రెండు రోజులు భగీరథ్‌ని విచారించాల్సి ఉంది. 7 రోజులపాటు కస్టడీకి ఇవ్వాలని పోలీసులు కోరినా, కోర్డు కేవలం 3 రోజులపాటు మాత్రమే కస్టడీకి అనుమతి ఇచ్చింది.

# రోగితో లైంగిక సంబంధం...

మొదటి పేజీ రుచాయి

సస్పెన్షన్ విధించింది. మహిళా రోగితో లైంగిక సంబంధం పెట్టుకోవడం, నిబంధనలకు విరుద్ధంగా ఆమెకు మత్తు మందులు సూచించడం వంటి తీవ్రమైన ఆరోపణలు రుజువు కావడంతో ఈ నిర్ణయం తీసుకుంది. వివరాల్లోకి వెళితే, కార్డిఫ్‌లోని యూనివర్సిటీ హాస్పిటల్ ఆఫ్ వేల్స్‌లో డాక్టర్ చిరాగ్ పటేల్ న్యూరో సర్జన్‌గా పనిచేస్తున్నారు. 2019లో వెన్నెముక సమస్యతో బాధపడుతున్న ఒక మహిళకు ఆయన శస్త్రచికిత్స చేశారు. ఆ తర్వాత కొద్దికాలానికే వారి మధ్య వ్యక్తిగత సంబంధం మొదలైంది. దాదాపు ఆరు నెలల పాటు ఈ సంబంధం కొనసాగింది. ఈ క్రమంలో ఆయన ఆమెకు అశ్లీల చిత్రాలు పంపినట్లు కూడా విచారణలో తేలింది. వారిద్దరి మధ్య సంబంధం దెబ్బతిన్న తర్వాత, 2022 మే నుంచి 2023 జనవరి మధ్య కాలంలో, డాక్టర్ పటేల్ ఆమెకు మార్ఫిన్ సల్ఫేట్, డయాజెపామ్ వంటి తీవ్రమైన మత్తు కలిగించే మందులను ఎలాంటి వైద్యపరమైన రికార్డులు లేకుండా, ఆమె జనరల్ ఫిజీషియన్‌కు సమాచారం ఇవ్వకుండా సూచించారు. ట్రైబ్యునల్ విచారణలో డాక్టర్ పటేల్ తన వాదన వినిపిస్తూ, ఆ సమయంలో తాను కుటుంబ సమస్యలతో బాధపడుతున్నానని తెలిపారు. సంబంధాన్ని ముగించాలని ప్రయత్నించినప్పుడు, ఆ మహిళ తనను బ్లాక్‌మెయిల్ చేసిందని, ఈ విషయం బయటపెడతానని బెదిరించిందని ఆరోపించారు. తన ఉద్యోగం, కీర్తి దెబ్బతింటాయనే భయంతోనే ఆమెతో పరిచయం కొనసాగించానని, మందులు సూచించానని చెబుతూ పశ్చాత్తాపం వ్యక్తం చేశారు. అయితే, డాక్టర్ పటేల్ వాదనను ట్రైబ్యునల్ తోసిపుచ్చింది. రోగి భద్రతను గాలికొదిలి, తన వృత్తిని, కుటుంబాన్ని కాపాడుకోవడానికే ఆయన ప్రాధాన్యత ఇచ్చారని అభిప్రాయపడింది. వృత్తిపరమైన హద్దులు మీరినందుకు శిక్షగా 8 నెలల సస్పెన్షన్ విధిస్తున్నట్లు ప్రకటించింది. అయితే, వేల్స్‌లో న్యూరోమాడ్యులేషన్ ప్రక్రియలలో ఆయనకున్న ప్రత్యేక నైపుణ్యాలను దృష్టిలో ఉంచుకుని, వైద్య రిజిస్టర్ నుంచి పూర్తిగా తొలగించడం లేదని స్పష్టం చేసింది.

# ప్రధాని మోదీతో సీఎం విజయ్ భేటీ

మొదటి పేజీ రుచాయి

నెదర్లాండ్స్ పర్యటన సందర్భంగా అనైమంగళం రాగి శాసనాలను తిరిగి భారత్‌కు తీసుకొచ్చినందుకు ప్రధాని మోదీకి, ముఖ్యమంత్రి విజయ్? కృతజ్ఞతలు తెలియజేశారు. దీనితోపాటు తమిళనాడు ప్రభుత్వ అధికారిక కార్యక్రమాల ప్రారంభంలో సంప్రదాయకంగా రాష్ట్ర ప్రార్థన గీతం 'తమిళ తాయ్? వాళ్తు' పాడడం ఆనవాయితీగా వస్తోందని సీఎం విజయ్? ప్రధానికి వివరించారు. అయితే ఈ ఏడాది జనవరిలో కేంద్ర హోంశాఖ జారీ చేసిన ఒక సర్క్యులర్ తర్వాత, ప్రభుత్వ కార్యక్రమాల్లో జాతీయ గీతాన్ని ముందుగా పాడుతున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో తమిళనాడు ప్రభుత్వ కార్యక్రమాల ప్రారంభంలో ఎప్పటిలానే రాష్ట్ర ప్రార్థన గీతాన్ని పాడడానికి అనుమతిస్తూ తగిన వివరణ ఇవ్వాలని కేంద్ర హోంశాఖను ఆదేశించాలని విజయ్ ప్రధానిని కోరారు. తమిళనాడులో 'సెంటర్ ఫర్ ఎయిర్‌బోర్న్ సిస్టమ్స్' (సీఏబీఎస్) ల్యాబ్‌ను ఏర్పాటు చేయాలని కూడా విజయ్ కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో అడ్వాన్స్‌డ్ మీడియం కాంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ (ఏఎంసీఏ) డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ సెంటర్, అలాగే సీఏబీఎస్ ఏర్పాటు చేయడంపై గత కొన్ని సంవత్సరాలుగా రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఓ)తో చర్చలు జరుగుతున్నాయని చెప్పారు.

**కర్ణాటక డ్యామ్ కు అనుమతి ఇవ్వొద్దు**

కావేరీ నదిపై కర్ణాటక ప్రభుత్వం ప్రతిపాదించిన 'మేకెదాటు డ్యామ్' ప్రాజెక్టు గురించి కూడా ప్రధాని మోదీతో విజయ్ మాట్లాడారు. 'ఈ మేకెదాటు ప్రాజెక్టు కోసం భూమి పూజ చేస్తామని కర్ణాటక ఉపముఖ్యమంత్రి ప్రకటన చేశారు. కావేరీ నీటి వివాదాల ట్రిబ్యునల్ ఇచ్చిన తుది తీర్పునకు, సుప్రీంకోర్టు ఆదేశాలకు ఇది పూర్తిగా విరుద్ధం' అని విజయ్ పేర్కొన్నారు. కర్ణాటక తలపెట్టిన ప్రాజెక్టు వల్ల తమిళనాడు రైతుల్లో తీవ్ర ఆందోళన కలిగించిందని ఆయన చెప్పారు. కావేరీ నదీ పరీవాహక ప్రాంతాలుగా ఉన్న తమిళనాడు, కేరళ, పుదుచ్చేరి రాష్ట్రాల అనుమతి లేకుండా ఈ మేకెదాటు ప్రాజెక్టుకు ఎలాంటి అనుమతులు ఇవ్వవద్దని కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖను, సెంట్రల్ వాటర్ కమిషన్ ను ఆదేశించాలని మోదీని విజయ్ కోరారు.

మత్స్యకారుల అరెస్టులపై ఆందోళన

శ్రీలంక నౌకాదళం తమిళనాడు మత్స్యకారులను అరెస్టు చేయడం, వేధించడం లాంటి ఘటనలు రోజురోజుకూ పెరిగిపోతుండడంపై సీఎం విజయ్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. కేవలం ఈ 2026 సంవత్సరంలోనే ఇలాంటి అరెస్టులు 12 సార్లు జరిగాయన్నారు. ప్రస్తుతం 58 మంది మత్స్యకారులు శ్రీలంక జైళ్లలోనే ఉన్నారని, అలాగే 266 ఫిషింగ్ బోట్లను శ్రీలంక స్వాధీనం చేసుకుందని ఆయన వివరించారు. మన మత్స్యకారులను, వారి బోట్లను వెంటనే విడుదల చేసేలా శ్రీలంక ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని ప్రధానిని కోరారు. ఆ తర్వాత ముఖ్యమంత్రి విజయ్, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. హస్తిన పర్యటనలో ఉన్న ఆయన కేంద్ర హోంమంత్రి అమిత్ షాతోపాటు కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీతోనూ సమావేశమయ్యే అవకాశం ఉందని సమాచారం.

# భావోద్వేగాలతో ఇరికించొద్దు

మొదటి పేజీ రుచాయి

భార్యాభర్తల మధ్య జరిగే గొడవల్లో అత్తమామలు మౌనంగా ఉన్నంత మాత్రాన వారిపై వరకట్న వేధింపుల కేసులు పెట్టలేమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. నైతికంగా ఆ ప్రవర్తన తప్పు కావచ్చు కానీ, దాన్ని క్రిమినల్ నేరంగా పరిగణించలేమని అత్యున్నత న్యాయస్థానం తేల్చిచెప్పింది. భర్త కుటుంబ సభ్యులందరినీ గుడ్డిగా కేసుల్లోకి లాగడం సరికాదని పేర్కొంది.

**భావోద్వేగాలతో ఇరికించొద్దు**

వైవాహిక వివాదాల్లో తీవ్రమైన భావోద్వేగాలు, వ్యక్తిగత కక్షలు దాగి ఉంటాయని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. ఇలాంటి సమయాల్లో కేవలం భర్తపైనే కాకుండా, గొడవలతో ఎలాంటి సంబంధం లేని అతని కుటుంబ సభ్యులందరినీ కేసుల్లో ఇరికించే ధోరణి ఎక్కువగా కనిపిస్తోందని ఆందోళన వ్యక్తం చేసింది. నిందితులుగా చేర్చిన వారు నిజంగానే క్రూరత్వానికి పాల్పడ్డారా? లేదా? అదనపు కట్నం కోసం వేధించారా అనేదానికి పక్కా ఆధారాలు ఉండటం చట్టప్రకారం ముఖ్యమని కోర్టు స్పష్టం చేసింది.

**నిర్దిష్ట ఆధారాలు ఉంటేనే**

జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ ఎన్.కె. సింగ్‌తో కూడిన ధర్మాసనం ఈ కీలక తీర్పును వెలువరించింది. భర్తకు మద్దతు ఇచ్చారనో, గొడవల్లో జోక్యం చేసుకోలేదనో లేదా సర్దుకుపోవాలని సలహా ఇచ్చారనో చెప్పి కుటుంబ సభ్యులపై క్రిమినల్ చట్టాలను ప్రయోగించలేమని కోర్టు స్పష్టం చేసింది. నేరంలో వారి ప్రత్యక్ష భాగస్వామ్యం లేదా నిర్దిష్టమైన పాత్ర ఉంటే తప్ప కేవలం సాధారణ ఆరోపణలతో అత్తమామలను దోషులుగా నిలబెట్టలేమని ధర్మాసనం వివరించింది.

**మధ్యప్రదేశ్ కేసు కొట్టివేత**

మధ్యప్రదేశ్‌లోని గుణా ప్రాంతానికి చెందిన ఓ మహిళ తన భర్త, అత్తమామలపై పెట్టిన వరకట్న వేధింపుల కేసును సుప్రీంకోర్టు ఈ సందర్భంగా కొట్టివేసింది. సదరు మహిళ తన అత్తమామలపై ఎలాంటి నిర్దిష్టమైన ఆరోపణలు చేయలేదని కోర్టు గుర్తించింది. విఫలమైన వివాహ బంధంలో మహిళ పడే వేదనను తక్కువ చేసి చూడలేమని చెబుతూనే ఇలాంటి వైవాహిక వివాదాల కేసులను విచారించేటప్పుడు కింది కోర్టులు మరింత జాగ్రత్తగా వ్యవహరించాలని, ఆరోపణలను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించింది.

# 'మహానాడు' 'దగానాడు'

మొదటి పేజీ రుచాయి

ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా వైసీపీ నేతలు విమర్శల జోరు పెంచారు. తాడేపల్లిలో జరిగిన మీడియా సమావేశంలో మాజీ మంత్రి ఆర్కే రోజా కూటమి పాలనపై, ముఖ్యంగా నారా లోకేశ్ పదోన్నతిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. టీడీపీ నిర్వహిస్తున్న మహానాడును 'దగానాడు'గా అభివర్ణించిన రోజా... వైసీపీ నేతలను అక్రమ కేసులతో భయభ్రాంతులకు గురిచేస్తూ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని ఆరోపించారు. గత ప్రభుత్వంలో జగన్ చేసిన అభివృద్ధి పనులను తమ ఖాతాలో వేసుకుంటూ క్రెడిట్ చోరీ చేస్తున్నారని మండిపడ్డారు. ఈ రెండేళ్ల కాలంలో కూటమి ప్రభుత్వం సొంతంగా ప్రారంభించి పూర్తి చేసిన ఒక్క పనినైనా చూపించగలదా అని ప్రశ్నించారు. అలాగే ఎన్నికల ముందు ప్రకటించిన 'సూపర్ సిక్స్' పథకాలు ఏమయ్యాయని, అవి సూపర్ హిట్ ఎలా అయ్యాయో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. నారా లోకేశ్ విద్యాశాఖ మంత్రి కాగానే రాష్ట్రంలో విద్యా వ్యవస్థ కుంటుపడిందని విమర్శించిన రోజా... మంత్రిగానే సరిగ్గా పని చేయని లోకేశ్‌ను ఇప్పుడు ఏకంగా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎలా చేశారని నిలదీశారు. రాష్ట్రంలో మహిళలపై దాడులు జరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ప్రశ్నిస్తానన్న నాయకుడు (పవన్ కల్యాణ్) ఇప్పుడు ఎక్కడ ఉన్నారో, ఏం చేస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. మహానాడులో లోకేశ్ ప్రకటించిన 33 శాతం మహిళా రిజర్వేషన్లపై స్పందిస్తూ.. గతంలో అధికారంలో ఉన్నప్పుడు ఎందుకు ఇవ్వలేదని, ఇప్పుడే ఎందుకు అన్నీ గుర్తుకు వస్తున్నాయని ప్రశ్నించారు. కూటమి మోసాలను ఎండగట్టేందుకు జూన్ 4 నుంచి వైసీపీ ప్రజల్లోకి వెళుతుందని రోజా స్పష్టం చేశారు.


# వర్షాలు కురిసే అవకాశం

మొదటి పేజీ రుచాయి

రాత్రి వానలు బీభత్సాన్ని సృష్టించాయి. వరుణుడు దాటికి రైతుల బతుకులు అతలాకుతలం అయ్యాయి. రాగల నాలుగైదు రోజుల పాటు అకాల వర్షాలు తెలంగాణ రాష్ట్రంలో అనేక చోట్ల వడగండ్లతో కూడిన ఉరుములు మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తున్నాయి. వేడిగా ఉన్న భూభాగం మీదకు తేమ గాలులు ప్రవేశించడం వల్ల అకాల వర్షాలు కురుస్తున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. వీటినే వేసవికాలంలో కురిసే ప్రీ మాన్‌సూన్ జల్లులంటారని పేర్కొంది. రాగల నాలుగైదు రోజుల పాటు అకాల వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారి శ్రీనివాస్‌రావు తెలిపారు. ఇవాళ ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్ జిల్లాల్లో ఉరుములు మెరుపులు ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉన్నాయని తెలిపారు. ఈ జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలను జారీ చేసినట్లు చెప్పారు. అకాల వర్షాలు కురుస్తున్నప్పటికీ ఉష్ణోగ్రతల్లో పెద్దగా మార్పు ఉండదని వాతావరణ కేంద్రం వివరించింది. ఇవాళ, రేపు ఉత్తర, తూర్పు తెలంగాణ జిల్లాలోని కొన్నింటికీ రెడ్ అలర్ట్ జారీ చేశామని వాతావరణ శాఖ అధికారి శ్రీనివాస్ రావు వివరించారు.

మొదటి పేజీ రుచాయి

# న్యాయవాది మొయినుద్దీన్ హత్యకేసులో కీలక పరిణామం




హైదరాబాద్, మే 27: న్యాయవాది మొయినుద్దీన్ హత్యకేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ హత్య కేసులో ప్రమేయం ఉన్న హైదరాబాద్‌కు చెందిన రాజకీయ నేతతోపాటు ఆయన కుమారుడిని పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. అనంతరం వారిని పోలీస్ స్టేషన్‌కు తరలించి.. విచారిస్తున్నారు. వక్ఫ్ బోర్డు నుంచి సదరు రాజకీయ నేతను తప్పించాలని న్యాయవాది మొయినుద్దీన్ తీవ్రంగా ప్రయత్నించారు. దీంతో రూ.15 లక్షల సుపారీ ఇచ్చి.. న్యాయవాదిని ఈ తండ్రికొడుకులు హత్య చేయించినట్లు తెలుస్తోంది. హైదరాబాద్‌లోని మలక్‌పేట, లక్డీకాపూల్, మల్లేపల్లి భూముల వివాదంలో ఈ న్యాయవాది హత్య జరిగిందని పోలీసుల విచారణలో వెల్లడయింది. వక్ఫ్ బోర్డు భూముల రక్షణ కోసం ప్రముఖ న్యాయవాది ఖాజా మొయినుద్దీన్ పోరాడుతున్నారు. మే 23వ తేదీన మాసబ్ ట్యాంక్ సమీపంలో మొయినుద్దీన్.. తన కారు ఎక్కుతున్నారు. అదే సమయంలో వెనుక నుంచి వచ్చిన ఓ కారు ఆయన్ని బలంగా ఢీకొట్టి.. అక్కడి నుంచి వెళ్లిపోయింది. ఈ విషయాన్ని గమనించిన మొయినుద్దీన్ కుటుంబ సభ్యులు.. వెంటనే ఆయన్ని సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మొయినుద్దీన్ మరణించారు. ఈ ఘటనపై తొలుత పోలీసులు హిట్ అండ్ రన్ కేసుగా నమోదు చేశారు. ఈ ఘటనపై పలు సందేహాలు వ్యక్తం కావడంతో.. ఈ కేసును పోలీసులు లోతుగా దర్యాప్తు చేశారు. ఈ ఘటన జరిగిన ప్రదేశంలో సీసీ టీవీ కెమెరా ఫుటేజ్‌లను పోలీసులు జల్లెడ పట్టారు. న్యాయవాదిని ఢీకొట్టిన కారుకు నెంబర్ ప్లేట్ లేకపోవడంతో.. ఈ పక్కా ప్లాన్ ప్రకారం జరిగిన హత్యగా పోలీసులు నిర్ధారించుకున్నారు. దీంతో నిందితుల గాలింపు కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. వక్ఫ్ భూముల విషయంలోనే ఈ హత్య జరిగినట్లు పోలీసులు నిర్ధారించారు.

# పుష్కరాల ఏర్పాట్లు అభినందనీయం..!

- తెలుగు రాష్ట్రాల మహామండలేశ్వర్
- బర్దిపూర్ ఆశ్రమ పీఠాధిపతులు
- అంత్య పుష్కరాలకు హాజరు
- ఘనంగా స్వాగతం చేసిన ప్రభుత్వ యంత్రాంగం





**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 27, జహీరాబాద్:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం లో జరుగుతున్న సరస్వతి అంత్య పుష్కరాలు భక్తిజన సందోహంతో కొనసాగుతున్నాయి. తెలుగు రాష్ట్రాలతో పాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తులు త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు ఆచరిస్తూ ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు.అంత్య పుష్కరాల్లో భాగంగా మంగళవారం సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండలం బర్దిపూర్‌కు చెందిన శ్రీ దత్తగిరి మహారాజ్ ఆశ్రమ పీఠాధిపతులు, తెలుగు రాష్ట్రాల మహామండలేశ్వర్ శ్రీశ్రీశ్రీ 1008 వైరాగ్య శిఖామణి అవధూతగిరి మహారాజ్, సిద్దేశ్వరానందగిరి మహారాజ్ త్రివేణి సంగమం వద్ద వైభవంగా గంగా హారతి నిర్వహించారు.బుధవారం ఉదయం వేద పండితులు, దేవస్థాన అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి పుష్కర స్నానం ఆచరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి దేవస్థానంలో స్వామివారి దర్శనం చేసుకుని మహా మంగళహారతి నిర్వహించారు.ఈ సందర్భంగా దేవస్థాన అధికారులు, ఆలయ అర్చకులు, పుష్కరాల ప్రత్యేక అధికారులు పీఠాధిపతులను శాలువాలతో ఘనంగా సన్మానించి ఆశీర్వాదాలు పొందారు. పుష్కరాల నిర్వహణలో అధికారులు చేస్తున్న సేవలను పీఠాధిపతులు అభినందించారు. వారి వెంట అడిషనల్ కమిషనర్ జ్యోతి, ఆర్‌జేసీ రామకృష్ణారావు, కార్యనిర్వహణ అధికారి మహేష్, దేవస్థాన చైర్మన్ ఉన్నారు.

## మదర్ ఇండియా ఫార్మ్ ల్యాండ్

# యజమాన్యం పై చర్యలు తీసుకోవాలి

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 27, నారాయణ ఖేడ్ :** రైతుల భూములను అక్రమంగా కబ్జా చేస్తూ కాల్వలు పెన్షన్ వేస్తున్న మదర్ ఇండియా ఫామ్ ల్యాండ్ యజనంపై చర్యలు తీసుకొని రైతులకు న్యాయం చేయాలని సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ఎమ్మార్వో ఆఫీస్ ముందు ధర్నా అనంతరం ఎమ్మార్వో కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది.ఈ సందర్భంగా సిపిఎం పార్టీ నారాయణఖేడ్ ఏరియా కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ నాలుగిద్ద మండలం ఔదత్ పూర్ గ్రామంలో సర్వేనెంబర్ 15 లో 7 ఎకరాల 20 గుంటలు ప్రభుత్వ భూమి సీలింగ్ పట్టా తాతల నుండి రైతులు అనుభవిస్తున్నారు. రైతుల పట్టా భూముల పక్కకు మదర్ ఇండియా ఫార్మ్ ల్యాండ్ ఏర్పాటుచేసి రైతుల పొలాలకు పోయే దారి మరియు కొంతమంది రైతుల పొలాలను కబ్జా చేయడం జరిగింది. ప్రస్తుతం రైతులు పంట పండించే కాలం కావున రైతులు తమ పొలాలకు వెళ్లి దున్నడం విత్తనాలు పెట్టడానికి మాకు కనీసం దారి ఇవ్వడం లేదని తమ ఫామ్ లేని పక్కన నుండి వెళ్లాలి ఎట్లా వెళితే బాగుండదు అని బెదిరింపులకు గురి చేస్తున్నాడు. తను చెప్పినట్టు వెళితే అక్కడ కుక్కలు రైతుల మీద పడుతున్నాయి. దీంతో రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. రైతులు ఇబ్బందులకు గురి చేస్తున్న మదర్ ఇండియా ఫార్మాన్ యజమాన్యం పై చట్టపరమైన చర్యలు తీసుకొని రైతులు తమ పొలాలకు వెళ్లే విధంగా చూడాలని రైతులు కోల్పోయిన భూమిని తిరిగి ఇప్పించాలని అన్నారు. లేనియెడల రైతులను ఐక్యం చేసి పోరాటాలు దీక్షలు చేస్తామని అన్నారు.



# బి.ఆర్.ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు అవగాహన కార్యక్రమం

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 27, నారాయణ ఖేడ్ :** బుధవారం నాడు నారాయణఖేడ్ పట్టణంలోని బి ఆర్ యస్ నాయకులు జీఎంఆర్ ఫౌండేషన్ చైర్మెన్ గుఱ్ఱపు మచ్చేందర్ కార్యాలయంలో అన్ని మండలాల బి ఆర్ యస్ పార్టీ నాయకులతో పార్టీ సభ్యత్వం విషయమై విస్తృత స్థాయి సమావేశం నిర్వహించటం జరిగింది.సమావేశంలో భాగంగా పార్టీ అధిష్టానం నిర్ణయం ప్రకారం వారు చెప్పిన కింది అంశాలను నాయకులతో చర్చించటం జరిగింది.గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు భారీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించడం. యువత, మహిళలు మరియు కొత్త ఓటర్లను ఎక్కువగా పార్టీలో చేర్చుకోవడం. డిజిటల్ సభ్యత్వ విధానాన్ని అమలు చేసి ఆన్‌లైన్‌లో నమోదు సౌకర్యం కల్పించడం. ప్రతి నాయకుడికి, ప్రజాప్రతినిధికి సభ్యత్వ లక్ష్యాలు ఇవ్వడం. క్రియాశీల కార్యకర్తలకు ప్రత్యేక గుర్తింపు కార్డులు ఇవ్వడం.సభ్యత్వ నమోదు ఆధారంగా భవిష్యత్ పార్టీ పదవులు మరియు బాధ్యతలు నిర్ణయించడం. బూత్ స్థాయిలో కమిటీలను బలోపేతం చేయడం.పార్టీ కోసం పనిచేసే కార్యకర్తలకు బీమా లేదా సంక్షేమ పథకాలపై చర్చించడం. అలాగే, పార్టీని మళ్లీ ప్రజల్లో బలంగా తీసుకెళ్లేందుకు సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఉద్యమంలా నిర్వహించాలని నాయకులకు తెలియపరచటం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మాజీ ఆత్మ కమిటీ డైరెక్టర్ అనుముల మారుతి, నారాయణఖేల్ మండల బి ఆర్ యస్ పార్టీ మాజీ అధ్యక్షులు రుద్రారం మాజీ సర్పంచ్ ప్రభాకర్, కంగ్టి మండల బి ఆర్ యస్ పార్టీ అధ్యక్షులు గంగారం, నాగలిగిద్ద మండల మాజీ వైస్ ఎంపీపీ పండరి యాదవ్, సంగారెడ్డి జిల్లా సాగర సంగం అధ్యక్షులు కృష్ణాపూర్ మాజీ ఎంపిటిసి అంజయ్య సాగర్, మాజీ ఎంపిటిసి విజయ్, కృష్ణాపూర్ మాజీ సర్పంచ్ కృష్ణారెడ్డి, దామరగిద్ద మాజీ సర్పంచ్ శంకర్ సాగర్, గంగాపూర్ మాజీ సర్పంచ్ నారాయణ సాగర్, సిర్గపూర్ మండల బి ఆర్ యస్ పార్టీ సీనియర్ నాయకులు బసవరాజు పటేల్, బోరంచ బి ఆర్ యస్ పార్టీ నాయకులు సిందోల్ సంగారెడ్డి, మార్డి బి ఆర్ యస్ పార్టీ ఉప అధ్యక్షులు కర్ణం రాజు,మోట్లకుంట నరసింహులు, బి ఆర్ యస్ పార్టీ సీనియర్ నాయకులు ఆకుల రాములు, బెల్లాపూర్ బి ఆర్ యస్ పార్టీ నాయకులు బసవరాజు పటేల్, రామాగౌడ్, మేగతాండ బి ఆర్ యస్ పార్టీ నాయకులు ప్రహ్లాద్, నాయకులు సంతోష్ పటేల్,మాజీ వార్డు మెంబర్ సాయిలు, యువ నాయకులు సందీప్,నమిల్ల హన్మండ్లు, మోహన్, మరియు వివిధ గ్రామాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# బక్రీద్ ఉద్రిక్తతలు: అపార్ట్‌మెంట్‌లోకి మేకలు..

## నిరసనగా పందిపిల్లతో ఎంట్రీ.. పోలీసుల హైడ్రామా!



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 27, ముంబై డెస్క్ :** బక్రీద్ పండుగ సమీపిస్తున్న వేళ ముంబైలోని మీరా రోడ్ ప్రాంతంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. గత రెండు రోజులుగా పూనమ్ క్లస్టర్ రెసిడెన్షియల్ సొసైటీలో రెండు వర్గాల మధ్య తీవ్ర ఘర్షణ వాతావరణం ఏర్పడింది. పరిస్థితి అదుపు తప్పకుండా ఉండేందుకు అధికారులు ఏకంగా 200 మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. నివాస సముదాయంలోకి బలి ఇచ్చే మేకలను తీసుకురావడాన్ని ఒక వర్గం వ్యతిరేకించడంతో ఈ వివాదం మొదలైంది. ప్రస్తుతం ఆ ప్రాంతంలో గుమిగూడటం, నినాదాలు చేయడంపై పోలీసులు నిషేధం విధించారు.

**వివాదం ఎలా మొదలైంది?**

స్థానిక అధికారుల సమాచారం ప్రకారం.. ఆదివారం పూనమ్ క్లస్టర్ ప్రాంతంలోని సృష్టి కాంప్లెక్స్‌లో ఈ వివాదం రాజుకుంది. బక్రీద్‌కు బలి ఇచ్చే మేకల కోసం హౌసింగ్ కాంప్లెక్స్ ఆవరణలో తాత్కాలిక షెడ్డు వేయడాన్ని స్థానికులు, హిందూ సంఘాలు తీవ్రంగా వ్యతిరేకించాయి.స్థానికుల ఆందోళనలతో ఆ తాత్కాలిక నిర్మాణాన్ని తొలగించినప్పటికీ.. సోమవారం ముస్లిం వర్గానికి చెందిన కొందరు గుమిగూడి నిరసన తెలపడంతో ఉద్రిక్తతలు పెరిగాయి. ఈ ఘటనపై కాశీమీరా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు నమోదైంది. ఇరువర్గాలను శాంతింపజేసేందుకు పోలీసులు జోక్యం చేసుకున్నప్పటికీ, ఆ రోజు రాత్రి ఇరు వర్గాల మధ్య స్వల్ప ఘర్షణ జరిగినట్లు సమాచారం. పరిస్థితి విషమించకుండా మంగళవారం రాత్రి మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన నాలుగు వాహనాల్లో మొత్తం 51 మేకలను పోలీసులు సొసైటీ నుంచి తరలించారు.

రంగంలోకి వీహెచ్‌పీ, భజరంగ్ దళ్

మంగళవారం ఆందోళనకారులు సొసైటీ గేట్ల వద్దకు చేరుకుని నినాదాలు చేయడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. వారు గేటు వద్ద హనుమాన్ చాలీసా పఠించారు. విశ్వహిందూ పరిషత్, భజరంగ్ దళ్ కార్యకర్తలు కూడా అక్కడికి చేరుకుని నిరసనలో పాల్గొన్నారు. ఈ క్రమంలో వీహెచ్‌పీకి చెందిన ఒక ప్రతినిధితో పాటు మరో ఇద్దరిపై బ్లేడుతో దాడి జరిగిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. హిందూ సంఘాల నినాదాలు, ఆందోళనలతో కాంప్లెక్స్ ప్రాంగణంలో రోజంతా హైడ్రామా కొనసాగింది.

**పందిపిల్లతో నిరసన.. పోలీసుల పరుగు**


ఈ మొత్తం వ్యవహారంలో ఒక నాటకీయ పరిణామం చోటుచేసుకుంది. బలి కోసం మేకలను తెచ్చిన కాంప్లెక్స్‌లోకి కొందరు నిరసనకారులు ఏకంగా ఒక పందిపిల్లను తీసుకువచ్చే ప్రయత్నం చేశారు.దీనికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఆందోళనకారుల నుంచి పందిపిల్లను లాక్కొని దాన్ని రక్షించేందుకు ఒక పోలీస్ ఆఫీసర్ దాన్ని చేతుల్లో ఎత్తుకుని పరిగెత్తుతున్న దృశ్యాలు ఈ వీడియోలో కనిపించాయి. మేకలను బలి ఇవ్వడానికి వ్యతిరేకంగా తాము "వరాహ పూజ" చేసేందుకే పందిని తెచ్చామని నిరసనకారులు వాదించారు.అయితే, వాస్తవానికి శ్రీ మహావిష్ణువు అవతారమైన వరాహ స్వామి జన్మదినాన్ని పురస్కరించుకుని చేసే 'వరాహ పూజ'ను వరాహ జయంతి రోజున (ఈ ఏడాది సెప్టెంబర్ 12న) జరుపుకుంటారు. ప్రస్తుతం పోలీసులు ఆ ప్రాంతాన్ని తమ అదుపులోకి తీసుకుని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

# అయోధ్య నిత్యాన్న సత్రం కోరకు రూ,లక్ష యాభై వేలు అందజేసిన చిక్క వెంకటేశ్వర్లు....



**హైదరాబాద్ పల్స్ న్యూస్,మే 27, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** అయోధ్య శ్రీ భక్త మార్కండేయ పద్మశాలీయ నిత్యాన్న సత్రం అయోధ్య క్షేత్రములో పద్మశాలి సత్ర ఏర్పాటుకు 2.05 ఎకరాలు స్థలము కొనుగోలు చేసి భవన నిర్మాణానికి ముందు నిలుచున్న సందర్భంగా మంగళవారం రోజున మార్గదర్శకులు గౌరవ చిలువేరు కాశీనాథ్ సూచన మేరకు కాశి నిత్యాన్న సత్రం అధ్యక్షులు గౌరవ భూరం శంకర్ మరియు గజం గురునాథం ప్రకాష్ మంగళవారం రోజు భువనగిరిలో గల యాదాద్రి భువనగిరి జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షులు చిక్క వెంకటేశ్వర్లు స్వగృహానికి వచ్చిన సందర్భంగా అయోధ్యలో కొనుగోలు చేసిన భూమి స్థలదాతగా మంగళవారం రోజు గౌరవ పెద్దలకు రూ, 1, 50,000 చెక్కు ఇవ్వనైనది కావున మన యాదాద్రి భువనగిరి జిల్లాలో గల మన కుల పెద్దలు సౌహృదయులు ఇట్టి మహత్తర కార్యక్రమంలో పాల్గొని స్థల దాతలుగా తమరు తమ పేర్లు నమోదు చేసుకొని ఇట్టి పుణ్య కార్యక్రమంలో తమరు అందరూ భాగస్వాములు కావాలని యాదాద్రి భువనగిరి జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షులు చిక్క వెంకటేశ్వర్లు కోరారు.

# యూనిఫాం సివిల్ కోడ్ బిల్లు.. ఆమోదం తెలిపిన అస్సాం అసెంబ్లీ




**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 27, సెంట్రల్ బ్యూరో:** దేశంలో ఉమ్మడి పౌరస్మృతి అమలు దిశగా మరో కీలక అడుగు పడింది. అస్సాం శాసనసభ ఇవాళ ఉమ్మడి పౌరస్మృతి బిల్లుకు అధికారికంగా ఆమోదం తెలిపింది. దీంతో దేశంలో ఈ చట్టాన్ని ఆమోదించిన రాష్ట్రాల జాబితాలో ఉత్తరాఖండ్, గుజరాత్‌ల తర్వాత అస్సాం మూడో రాష్ట్రంగా నిలిచింది. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్-44 ప్రకారం.. దేశంలోని పౌరులందరికీ ఒకే విధమైన పౌర చట్టాన్ని వర్తింపజేయాలనేది ఈ బిల్లు యొక్క ముఖ్య ఉద్దేశం. మతం, కులం, వర్గంతో సంబంధం లేకుండా వివాహం, విడాకులు, ఆస్తి వారసత్వం, దత్తత వంటి వ్యక్తిగత విషయాలలో రాష్ట్రంలోని ప్రజలందరికీ ఇకపై ఒకే చట్టం వర్తించనుంది. గతంలో ఉత్తరాఖండ్, గుజరాత్ రాష్ట్రాలు ఈ బిల్లును ఆమోదించగా, ఇప్పుడు అస్సాం కూడా ఆ బాటలోనే పయనిస్తూ దేశంలో చర్చకు తెరలేపింది.

# పిడుగు పడి పాడి గేదె మృతి

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 27, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రాజపేట మండలం మల్లగూడెం గ్రామ రైతు గొడుగు కనకయ్య కు సంబంధించిన పాడి గేదే మంగళవారం రాత్రి పిడుగుపాటుకు మృతి చెందింది. ముర్రా జాతికి చెందిన సుమారు 80,000 రూ, విలువైన పాడి గేదే మృతితో కుటుంబ ఆదాయ, ఆర్థిక పరిస్థితి దెబ్బతినే అవకాశాలు ఉన్నాయని ప్రభుత్వం వెంటనే తగు సాయం చేయాలని సర్పంచ్ జన్నపల్లి బాలరాజు రెడ్డి కోరారు. మల్లగూడెం గ్రామానికి చెందిన పరిష ఐలయ్య ఇంటిపై పిడుగు పడటంతో స్లాబ్ పెచ్చులు ఊడిపోయి నట్లు తెలిపారు. ప్రభుత్వం ఆర్థిక సాయం అందజేయాలని సర్పంచ్ కోరారు.



# వివోఏ లకు ఉద్యోగ భద్రత కల్పించాలి....

## వివోఏ జేఏసి నాయకులు తవిటి స్వప్న



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 27, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** ఆత్మకూరు(ఎం) మండలంలోని మండల మహిళ సమాఖ్య కార్యాలయం ఎదుట వివోఏ లు చేస్తున్న రిలే నిరాహార దీక్షలు పదోవ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా వివోఏ జేఏసి నాయకులు తవిటి స్వప్న మాట్లాడుతూ.... వివోలకు ఉద్యోగ భద్రత కల్పించాలని, వేతనాలు ఇరవై వేలు ఇవ్వాలని, ప్రమోషన్లు ఇవ్వాలనే డిమాండ్స్ తో ఈ దీక్షలు నడుస్తున్నాయి. ప్రభుత్వం, అధికారులు తక్షణమే వివోఏ ల న్యాయమైన డిమాండ్స్ ను పరిష్కారం చేయాలని కోరారు. ఈ దీక్షల్లో వివోఏ జేఏసి నాయకులు తవిటి స్వప్న, నాగభూషణం, తుమ్మల సరిత, పులుసాని సునీతా, కొరకొప్పుల సుధాకర్, మందుజు జయమ్మ, ఉప్పల విజయ, కాన్ రాజు నాగరాణి, వేముల నర్సింహ్మ, వేములకొండ శ్రీనివాస్, పోలేపాక భాగ్యమ్మ, బూడిద సుచరిత, మర్రిపల్లి ప్రమీల, పాశం శ్యామల, కే.మౌనిక, ఎం.విజయలక్ష్మి, యాస మహేశ్వరి, భూషి ఉపేంద్ర, కానుకుంట్ల శ్రీనివాస్, మచ్చ సోమయ్య, నామాల రాజు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ అదరాసుపల్లి శ్రీధర్ శర్మ పర్యవేక్షణలో నగర సంకీర్తన....



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 27, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రాజపేట మండలం రేణికుంట గ్రామంలో ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని మర్కుక్ శ్రీ పాండురంగ ఆశ్రమం ఆధ్వర్యంలో శ్రీ అదరాసుపల్లి శ్రీధర్ శర్మ పర్యవేక్షణలో రేణికుంట గ్రామంలోని అతి పురాతనమైన మహిమాన్వితమైన శ్రీ భవానీ శంకర స్వామి శివాలయం నుండి ఏకాదశి హరే రామ హరే కృష్ణ నామ నగర సంకీర్తన శ్రీ పరాభావ నామ సంవత్సర అధిక జ్యేష్ఠ మాస ఏకాదశి బుదవారం ఉదయం 5:30 నుండి రేణికుంట గ్రామంలోని పురవీదుల గుండా హరేరామ హరేకృష్ణ కీర్తన నగర సంకీర్తన చేస్తు నిర్వహించటం జరిగింది. ముందుగా ఆలయ అర్చకులు శ్రీ రేగొండ పాండురంగం ఏకాదశి పురస్కరించుకుని శ్రీ భవానీ శంకర స్వామి వారికి పంచామృతాలతో రుద్ర నమక చమకాలతో అభిషేకం నిర్వహించి. అష్టోత్తర శత నామాలతో పూలు సమర్పించి నైవేద్యం నివేదన చేయటం జరిగింది. నగర సంకీర్తన తదనంతరం శ్రీ భవానీ శంకర స్వామి వారికి మంగళ నీరాజనం సమర్పించి భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేయటం జరిగింది. ఈ కార్యక్రమంలో శ్రీ భవానీ శంకర భక్త బృందం అత్యంత భక్తి శ్రద్ధలతో పాల్గొనటం జరిగింది.

# కొరారిలో సీఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలించిన కాంగ్రెస్ ఇంచార్జి అజ్మీరా శ్యామ్ నాయక్




**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 27, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:**
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జూన్ 1న కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా పర్యటన నేపథ్యంలో, కెరమెరి మండలం కొరారి గ్రామంలో ఏర్పాట్లను ఆసిఫాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి అజ్మీరా శ్యామ్ నాయక్ బుధవారం పరిశీలించారు. మాజీ డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఇరుకుల మంగ, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు. కొరారి గ్రామంలో కొలాం ఆదివాసీల కోసం నిర్మించిన 28 ఇందిరమ్మ ఇళ్లను సీఎం ప్రారంభించనున్నారు. గృహప్రవేశాల అనంతరం కాగజ్‌నగర్ ఎక్స్ రోడ్డులో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నారు. సభను విజయవంతం చేసేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, నియోజకవర్గ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని అజ్మీరా పిలుపునిచ్చారు

# మానవత్వమే మహా మతమని మరోసారి నిరూపించింది ఎండీర్ ఫౌండేషన్

## ఒకే రోజు రెండు అనాధ శవాలకు అంత్యక్రియలు నిర్వహించిన ఎండీర్ ఫౌండేషన్

**పటాన్ చెరు, హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 27 :**
సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు మండల పరిధిలోని ఇస్నాపూర్ ఎక్స్ రోడ్ సమీపంలో, అలాగే పటాన్చెరు పోలీస్ స్టేషన్ దగ్గర సుమారు 50 సంవత్సరాల వయస్సు గల వ్యక్తి మృతి చెందిన ఘటనల్లో, వారి కుటుంబ సభ్యులు లేదా బంధువులు ఎవరూ ముందుకు రాకపోవడంతో ఎండీర్ ఫౌండేషన్ సభ్యులు స్పందించారు. మృతులకు సంబంధించిన వివరాలు సేకరించి, పోలీసుల సహకారంతో అన్ని నిబంధనలు పాటిస్తూ, వారిని తమ కుటుంబ సభ్యులుగా భావించి గౌరవప్రదంగా అంత్యక్రియలు నిర్వహించారు.మనిషి చనిపోయిన తర్వాత కూడా అతనికి గౌరవం దక్కాలి అనే భావనతో ఎండీర్ ఫౌండేషన్ నిరంతరం సేవా కార్యక్రమాలు కొనసాగిస్తోంది. సమాజంలో ఎవరు ఒంటరివారు కారని, అనాధలకు కూడా మనం అండగా ఉండాలనే మానవత్వ సందేశాన్ని ఈ కార్యక్రమం ద్వారా అందించారు. జన్మించిన ప్రతి మనిషికి గౌరవం ఎంత ముఖ్యమో, చివరి ప్రయాణం కూడా అంతే గౌరవంగా ఉండాలి, అనే ఆలోచనతో ఎండీర్ ఫౌండేషన్ చేస్తున్న ఈ సేవలను స్థానికులు అభినందించారు.



# పారిగామ్ వాగు సమీపంలో వేలాడుతున్న విద్యుత్ తీగలు .....

## ప్రజల్లో భయాందోళన.....



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 27, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి::** కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ టీ మండలం పారిగామ్ గ్రామంలో వాగు సమీపంలోని విద్యుత్ స్తంభాల నుండి తీగలు కిందికి వంగి ప్రమాదకరంగా వేలాడుతున్నాయి. వాగు దాటే రైతులు, పశువులు మేపే కూలీలు ఈ మార్గాన్ని నిత్యం వినియోగిస్తుండటంతో ఎప్పుడైనా తీవ్ర ప్రమాదం సంభవించే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.వర్షాకాలం నేపథ్యంలో విద్యుత్ షాక్ ముప్పు మరింత పెరిగిందని గ్రామస్థులు హెచ్చరిస్తున్నారు. విద్యుత్ శాఖ అధికారులు వెంటనే స్పందించి తీగలను మరమ్మతు చేసి ప్రజల ప్రాణాలను కాపాడాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు

# నెహ్రూ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించిన కాంగ్రెస్ నాయకులు



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 27, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రాజపేట మండల కేంద్రంలో నెహ్రూ విగ్రహం వద్ద బుధవారం తొలి భారత దేశ ప్రధాని నెహ్రూ వర్ధంతి కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నమిల మహేందర్ గౌడ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి నెహ్రూ దేశానికి ప్రజలకు చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో రాజపేట పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఐరేని నవీన్ కుమార్, ఆలేరు వ్యవసాయ శాఖ మార్కెట్ కమిటీ డైరెక్టర్ మాడోత్ విఠల్ నాయక్, ఉప సర్పంచ్ నమిల కేదారి గౌడ్, డాక్టర్ చింతల రవి, కొత్తజాల పందరి, రేణికుంట సిద్ధులు, పొట్టబత్తిని వెంకటేష్, గొల్లైన ఐలయ్య, జయ రాములు తదితరులు ఉన్నారు.

# లక్ష రూపాయల విలువైన ఎల్ఓసిని అందజేసిన ఎమ్మెల్యే జిఎంఆర్



**పటాన్ చెరు, హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 27:**
ఆపత్కాలంలో నిరుపేదలకు మెరుగైన వైద్యం అందించడంలో ముఖ్యమంత్రి సహాయనిధి అండగా నిలుస్తోందని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు.తెల్లాపూర్ డివిజన్ పరిధిలోని ఇందిరా నగర్ కాలనీకి చెందిన నోముల నరసింహ గౌడ్ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. మెరుగైన వైద్య చికిత్స కోసం స్థానిక శాసనసభ్యులు జిఎంఆర్ ద్వారా ఎల్ఓసి కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన లక్ష రూపాయల విలువైన ఎల్ఓసిని బుధవారం సాయంత్రం పటాన్చెరు లోని తన కార్యాలయంలో నరసింహ గౌడ్ కుటుంబ సభ్యులకు అందచేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, మాజీ కౌన్సిలర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ మహిళలతో మహిళా వారోత్సవాలు...



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 27, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** మహిళా వారోత్సవాలు సందర్భంగా ఆత్మకూరు మండలం సారగండ్లగూడెం గ్రామంలో ఉపాధి హామీ పని ప్రదేశంలొ మహిళలను కలిసి మహిళలపై జరుగుతున్న అత్యాచారాల గురించి 2013 ఫోక్సో చట్టం గురించి అవేర్నెస్ ప్రోగ్రాం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు సెక్టార్ సూపర్వైజర్ జీ.వాణిశ్రీ, గ్రామ సర్పంచ్ సారగండ్ల చలమయ్య, అంగన్వాడీ టీచర్ సునీత, మరియు మహిళలు గ్రామ ప్రజలు పాల్గొనడం జరిగింది.

# రైతులు ఎవరు అధైర్య పడొద్దు సర్పంచ్ భూక్య సంతోష్ నాయక్



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 27, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** యాదాద్రి భువనగిరి జిల్లా, తుర్కపల్లి మండలంలోని ములకలపల్లి రెవిన్యూ పరిధిలో వడ్ల ధాన్యాన్ని వడ్ల కాంటను పరిశీలించిన సర్పంచ్ భూక్య సంతోష్ నాయక్ మాట్లాడుతూ... ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తాం అని రైతులకు భరోసా ఇవ్వడం జరిగిందని త్వరలోనే వడ్లు ట్రాన్స్పోర్టేషన్ జరుగుతాదని, రైతులతో కలిసి వడ్ల కాంటను విజిట్ చేయడం జరిగింది. రైతులు ఎవరు అధైర్య పడవద్దని భరోసా ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు

# బక్రీద్ ఏర్పాట్లు పరిశీలించిన కాంగ్రెస్ ఇంచార్జి అజ్మీరా శ్యామ్ నాయక్.....

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 27, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి::**



కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని ఈద్గా వద్ద బక్రీద్ పండుగ ఏర్పాట్లను ఆసిఫాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి అజ్మీరా శ్యామ్ నాయక్ బుధవారం పరిశీలించారు. మాజీ డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్, మార్కెట్ కమిటీ చైర్మన్ మంగ, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అబ్దుల్లాతో కలిసి ఈద్గా ప్రాంగణాన్ని సందర్శించి ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు.ఎండ తీవ్రత నేపథ్యంలో నమాజ్‌కు వచ్చే ముస్లిం సోదరులకు ఇబ్బందులు కలగకుండా షామియానాలు ఏర్పాటు చేయాలని, చల్లని త్రాగునీటి సౌకర్యం కల్పించాలని మున్సిపల్ వర్క్ ఇన్స్పెక్టర్‌కు సూచించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు తారిఖ్, ప్రధాన కార్యదర్శి గదవేని మల్లన్న, మాజీ ఎంపీపీ బాలేష్ గౌడ్, స్థానిక కౌన్సిలర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



## బోదకాల వ్యాధిగ్రస్త వృద్ధురాలికి సర్పంచ్ సహాయహస్తం

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 27 కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండలం కన్నెపల్లి గ్రామానికి చెందిన ఇప్ప పోశక్క బోదకాల వ్యాధి కారణంగా నడవలేని స్థితికి చేరుకుంది. ఆర్థిక పరిస్థితులు కూడా దయనీయంగా ఉండటంతో గ్రామ సర్పంచ్ మోర్లె పార్వతి, ఉపసర్పంచ్ మోర్లె సమత స్వయంగా ఆమె ఇంటికి వెళ్లి పరిస్థితిని పరిశీలించారు. నడకకు అవసరమైన వాకర్‌తో పాటు 25 కిలోల బియ్యం, పప్పులు, వంట నూనె సహా నిత్యావసర సరుకులను సర్పంచ్ అందజేశారు. అన్ని విధాలుగా సహాయం కొనసాగిస్తామని హామీ ఇచ్చారు. సర్పంచ్ చొరవను గ్రామస్థులు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యుడు చెన్నూరి తిరుమలేష్, యువ నాయకులు మోర్లె పాండురంగ్, మోర్లె రాజు, జూనారి రమేష్, మందాడే విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## కాగజ్ నగర్ విద్యార్థినికి ఐ క్యాప్ ఫౌండేషన్ సన్మానం

**భవిష్యత్ చదువుకు మద్దతు హామీ**



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 27, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ కి చెందిన విద్యార్థిని మల్లేపల్లి అంజలి వరంగల్‌లోని ఫాదర్ ఆఫ్ కొలంబో మెడికల్ కాలేజీలో కార్డియాలజీ (సివిటి) ప్రథమ సంవత్సర పరీక్షల్లో యూనివర్సిటీ స్థాయిలో మొదటి ర్యాంకు, రాష్ట్ర స్థాయిలో మూడో ర్యాంకు సాధించింది. ఈ విజయాన్ని సందర్భంగా ఐ క్యాప్ ఫౌండేషన్ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ ఆమెను సన్మానించి, భవిష్యత్ చదువుకు అవసరమైన ప్రోత్సాహం అందిస్తామని హామీ ఇచ్చింది. గ్రామీణ విద్యార్థులకు సరైన అవకాశాలు దక్కితే ప్రపంచ స్థాయి పోటీని అధిగమించగలరని, ప్రతిభావంతులకు భరోసా ఇవ్వడమే తమ సంస్థ బాధ్యత అని ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు. విద్య, యువత సాధికారత, నైపుణ్య శిక్షణ ద్వారా గ్రామీణ యువతను తీర్చిదిద్దడం తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. భవిష్యత్తులో జిల్లాలోని ప్రతిభావంతులను గుర్తించి వారికి ఆర్థిక సహాయం, కెరీర్ గైడెన్స్, నైపుణ్య శిక్షణ, సిఎస్ఆర్ నిధులతో విద్యా సహాయం అందించనున్నట్లు సంస్థ ప్రకటించింది. కార్యక్రమంలో ఐ క్యాప్ టీమ్ సభ్యులు, స్థానిక ప్రముఖులు, సామాజిక కార్యకర్తలు పాల్గొని అంజలిని అభినందించారు.

## బండి సంజయ్‌కు బీజేపీ జిల్లా నాయకులు కలిసి జిల్లా సమస్యలు వినతి



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 27, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి::** కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌ను కొమురం భీం జిల్లా బీజేపీ అధ్యక్షుడు ధోని శ్రీశైలం నేతృత్వంలో పార్టీ నాయకుల బృందం కరీంనగర్‌లోని మహాశక్తి అమ్మవారి ఆలయంలో సౌజన్యపూర్వకంగా కలిసింది. రాష్ట్ర కార్యాలయ సభ్యుడు గొల్లపల్లి వీరభద్రచారి, ఆత్మనిర్భర్ భారత్ జిల్లా కన్వీనర్ కేసరి ఆంజనేయులు గౌడ్, సీనియర్ నాయకుడు సేర్ల మురళీధర్, జిల్లా కోశాధికారి కొలిపాక కిరణ్ కుమార్, బిజెవైఎం రాష్ట్ర నాయకుడు ఎలగటి సుచీత్ తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. తెలంగాణ రాజకీయ పరిస్థితులు, ప్రజా సమస్యలు, పార్టీ బలోపేతం, కార్యకర్తల అభివృద్ధిపై చర్చలు జరిగాయి. కొమురం భీం జిల్లా అభివృద్ధికి, స్థానిక సమస్యల పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం మరింత సహకారం అందించాలని నాయకులు మంత్రికి విజ్ఞప్తి చేశారు.

## బౌరంపేట పోస్ట్ ఆఫీస్ నందు ప్రజా అవగాహన డిసీడీపీ డాక్ కమ్యూనిటీ డెవలప్మెంట్ కార్యక్రమం

**కుత్బుల్లాపూర్, మే 27, హైదరాబాద్ పల్స్ న్యూస్ :** ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బౌరంపేట్ డివిజన్ బిజెపి అధ్యక్షులు పీసరి కృష్ణారెడ్డి పాల్గొని కేంద్ర ప్రభుత్వం ఆధీనంలో నిర్వహిస్తున్న యొక్క పోస్ట్ ఆఫీస్ నుండి ప్రజలకు ఎంతో ఉపయోగకరమైన సేవింగ్స్ అకౌంట్ బీమాలు పెన్షన్లు ముఖ్యమైన పోస్ట్ సమాచారాలు నిర్వహించడం జరుగుతుంది. కాబ్బటి ప్రతి ఒక్కరు యొక్క పోస్ట్ ఆఫీస్ ద్వారా ప్రధానమంత్రి సురక్ష బీమా సంవత్సరానికి ?20 , ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా సంవత్సరానికి 440 లైఫ్ ఇన్సూరెన్స్ కోసం కూడా ఏ స్థాయిలో ఆ స్థాయి వారు కూడా ఈ పోస్ట్ ఆఫీస్ ద్వారా బీమా చేసుకోవచ్చు. సుకన్య యోజన మనం ఇష్టం వచ్చినంత మన ఆడపిల్లల పేరు మీద వంద రూపాయలు డిపాజిట్ చేస్తే ప్రభుత్వం 100 రూపాయలు కలిపి 21 సంవత్సరం తర్వాత ఆడపిల్ల భవిష్యత్తు పెళ్లి కోసం ఉపయోగపడుతుంది. ఇలాంటివి చేయడం వలన మన కుటుంబానికి మన మరణ అనంతరం ఇబ్బందులకు గురికాకుండా జీవనాధారమై నిలవడం జరుగుతుంది. కావున ప్రతి ఒక్కరూ ఈ యొక్క పోస్ట్ ఆఫీస్ను తమ కుటుంబంలో వినియోగించుకొని అనంతరం కుటుంబానికి ఉపయోగపడేలా సేవలు పొందగలరని దీంతో ఎలాంటి నిర్లక్ష్యం చేయకుండా భవిష్యత్తు కుటుంబం భవిత భద్రత మనది బాధ్యతగా భావించి వినియోగించుకోవాలని సూచించడం జరిగింది.ఏ స్ పి ఓ నార్త్ సూపరిండెంట్ ఆఫ్ పోస్ట్ ఆఫీసర్ సంపత్ రెడ్డి సికింద్రాబాద్ సబ్ డివిజన్ బౌరంపేట పోస్ట్ ఆఫీసర్ బైండ్ల ఎల్లేష్ సిబ్బంది పాల్గొన్నారు.



# గీతంలో నాలుగేళ్ల ఇంటిగ్రేటెడ్ బీ.ఎడ్

**2026-27 విద్యా సంవత్సరం నుంచి ఆరంభం**
**ఎన్.సి.ఇ.టి.లో అర్హత సాధించడం తప్పనిసరి**

**పటాన్చెరు, హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 27 :** గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో 2026-27 విద్యా సంవత్సరం నుంచి నాలుగేళ్ల ఇంటిగ్రేటెడ్ టీచర్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్ (సమగ్ర ఉపాధ్యాయ విద్యా కార్యక్రమాన్ని)ను ప్రవేశపెట్టనుంది. ఈ ప్రోగ్రామ్ ద్వారా బి.ఏ. బి.ఎడ్., బి.ఎస్సీ. బి.ఎడ్. అనే నాలుగేళ్ల డ్యూయల్-మేజర్ అండర్ గ్రాడ్యుయేట్ డిగ్రీలను అందిస్తుందని స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ రిచా శర్మ బుధవారం విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించారు. భారతదేశ జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ) 2020 చట్రంలో ఇది భాగమని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమం యొక్క ప్రాముఖ్యతను డాక్టర్ శర్మ వివరిస్తూ, భవిష్యత్తు కోసం అత్యంత అర్హత కలిగిన, బహుళ-విషయ పరిజ్ఞానం గల విద్యావేత్తలను తయారు చేసే లక్ష్యంతో, 12 తరగతి లేదా ఇంటర్మీడియెట్ తరువాత వెంటనే విషయ పరిజ్ఞానాన్ని వృత్తిపరమైన బోధనా శిక్షణతో అనుసంధానించడానికి సమగ్ర ఉపాధ్యాయ విద్యా కార్యక్రమాన్ని రూపొందించామన్నారు. పాఠశాల విద్యలోని వివిధ దశలలో ఉన్న విద్యార్థుల కోసం వారి వయస్సుకు తగిన అభ్యాస అనుభవాలను సృష్టించగల ఉత్సాహవంతులైన, వృత్తిపరంగా శిక్షణ పొందిన, సామాజిక బాధ్యత గల ఉపాధ్యాయులను తీర్చిదిద్దడమే ఈ కార్యక్రమ లక్ష్యమని తెలియజేశారు. నాలుగేళ్ల సమగ్ర కార్యక్రమం, కాబోయే ఉపాధ్యాయులకు విషయం, బోధనా పద్ధతులు, విలువలు, తరగతి గది ఆచరణలో సమగ్ర శిక్షణను అందించడమే ప్రధాన లక్షాలుగా డాక్టర్ రిచా పేర్కొన్నారు. ఈ పాఠ్యప్రణాళిక 21వ శతాబ్దపు ప్రపంచ విద్యా ప్రమాణాలకు అనుగుణంగా ఉంటూనే, బాల్య దశ సంరక్షణ, విద్య (ఈసీసీఈ), ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యాశాస్త్రం (ఎఫ్ఎల్ఎన్), సమ్మిళిత విద్య, భారతీయ విలువలు, సంస్కృతి, సంప్రదాయాలు, నైతిక విలువలకు కూడా ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఈ సమగ్ర అండర్ గ్రాడ్యుయేట్ ఉపాధ్యాయ విద్యా కార్యక్రమం, కొత్త పాఠశాల నిర్మాణంలోని నాలుగు దశలైన- ఫౌండేషనల్, ప్రిపరేటరీ, మిడిల్, సెకండరీ (5ం3ం3ం4) కోసం ఉపాధ్యాయులను సిద్ధం చేస్తుందని డాక్టర్ రిచా వివరించారు. విద్యార్థులు సాంప్రదాయ ఐదేళ్ల మార్గానికి బదులుగా తమ ఉపాధ్యాయ విద్యను నాలుగేళ్లలో పూర్తి చేయవచ్చని, తద్వారా ఒక విద్యా సంవత్సరాన్ని ఆదా చేసుకోవచ్చని ఆమె తెలిపారు. 2026-27 విద్యా



సంవత్సరానికి గాను, ఈ కార్యక్రమం దేశవ్యాప్తంగా ఉన్న సుమారు 223 భాగస్వామ్య సంస్థలలో (ఐఐటీలు, ఎన్ఐటీలు, ప్రాంతీయ విద్యా సంస్థ (ఆర్ఐఈ)లు, కేంద్ర, రాష్ట్ర విశ్వవిద్యాలయాలతో పాటు గీతంలో కూడా) ఈ కోర్సును అందిస్తున్నారని, దాదాపు 16,950 సీట్లు దేశవ్యాప్తంగా అందుబాటులో ఉన్నాయని డాక్టర్ రిచా శర్మ పేర్కొన్నారు. జాతీయ ఉమ్మడి ప్రవేశ పరీక్ష (ఎన్.సి.ఇ.టి.) 2026 ద్వారా ఈ కోర్సులో ప్రవేశాలను నిర్వహిస్తారని, ఈ పరీక్షలో సాధించిన అర్హతను బట్టే ఆయా సంస్థలు ప్రవేశాలు కల్పిస్తాయని తెలిపారు.

# సీఎం హామీలు గాలిలో కలిశాయ్.. కొనుగోలు కేంద్రాల్లో రైతుల కన్నీటి కథలు

**హైదరాబాద్ పల్స్, మే 27, మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి:** మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం చిలుకోడు గ్రామంలో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ రాష్ట్ర ప్రభుత్వ ధాన్యం కొనుగోలు విధానంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. రైతుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తోందని, ముఖ్యమంత్రి మరియు మంత్రులు చేస్తున్న ప్రకటనలు కేవలం ప్రచారానికే పరిమితమయ్యాయని ఆయన ఆరోపించారు. రాష్ట్రంలో యాసంగి సీజన్‌లో సుమారు 90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి కాగా, ఇప్పటివరకు కేవలం 51 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యమే కొనుగోలు చేయడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. మిగిలిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే పేరుకుపోయి ఉండగా రైతులు తీవ్ర ఆందోళనతో రోజులు గడుపుతున్నారని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతుల వద్ద ఉన్న ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని పదేపదే ప్రకటించినా, క్షేత్రస్థాయిలో మాత్రం ఆ మాటలు ఎక్కడా అమలవడం లేదని విమర్శించారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కూడా రైతులకు పూర్తి భరోసా ఇస్తామని చెప్పినా, కొనుగోలు కేంద్రాల్లో కనీస సదుపాయాలు కూడా లేక రైతులు అవస్థలు పడుతున్నారని ఆగ్రహం

**"ప్రభుత్వ ప్రచారం ఒక్కలా... క్షేత్రస్థాయిలో రైతుల పరిస్థితి మరోలా ఉంది" : మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్**
**ధాన్యం కొనుగోళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మండిపాటు**

వ్యక్తం చేశారు. అకాల వర్షాల కారణంగా ధాన్యం తడిసి నాణ్యత కోల్పోతుండగా ప్రభుత్వం మాత్రం స్పందించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. తూకం యంత్రాల కొరత, గన్నీ బ్యాగుల సమస్య, రవాణా ఆలస్యం కారణంగా రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారని తెలిపారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు రాత్రింబవళ్లు కాపలా కాస్తూ, ట్రాక్టర్లపైనే రోజులు గడపాల్సిన దుస్థితి నెలకొందన్నారు. ప్రభుత్వం రూ.23 వేల కోట్లతో ధాన్యం కొనుగోళ్లు చేస్తున్నామని గొప్పలు చెప్పుకుంటోందని, కానీ రైతులకు మాత్రం ఆ భరోసా ఎక్కడా కనిపించడం లేదని విమర్శించారు. "ప్రచారంలో రైతు రాజు... కానీ క్షేత్రస్థాయిలో రైతు బాధితుడు" అనే పరిస్థితిని కాంగ్రెస్ ప్రభుత్వం సృష్టించిందని మండిపడ్డారు. రైతులు




పండించిన ప్రతి గింజను వెంటనే కొనుగోలు చేసి, పెండింగ్‌లో ఉన్న ధాన్యాన్ని తక్షణమే లిఫ్టింగ్ చేయాలని డీఎస్ రెడ్యానాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతులను మోసం చేసే ప్రకటనలు మానుకుని, క్షేత్రస్థాయిలో నిజమైన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్ మాజీ చైర్మన్ కత్తెరసాల విద్యాసాగర్, మాజీ ఎంపీపీ డీఎస్ బాలు నాయక్,సోసైటి చైర్మన్ చే రెడ్డి బిక్షం రెడ్డి, చిలుకోడు గ్రామ సర్పంచ్ రాయల వెంకటేశ్వరావు, కాడెం బాబు, దేశని ఉపేందర్, కాడెం ప్రశాంత్, రాయల నరేష్, నూకల ఉపేందర్, బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఆజ్మీర బాల్య, సాయి తొలి వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు



**హైదరాబాద్ పల్స్, మే 27, మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి:** డోర్నకల్ మండలం దుబ్బతండ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ ఆజ్మీర బాల్య, ఆయన కుమారుడు సాయి ఖమ్మం నగరంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ దుర్ఘటనకు ఏడాది పూర్తయిన సందర్భంగా బుధవారం వారి తొలి వర్ధంతి కార్యక్రమాన్ని కుటుంబ సభ్యులు, అజ్మీర భారతి గ్రామంలో ఘనంగా నిర్వహించారు. వర్ధంతి కార్యక్రమంలో ఆజ్మీర బాల్య, సాయి చిత్రపటాలకు పూలమాలలు వేసి కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు నివాళు లర్పించారు. ఈ సందర్భంగా గ్రామమంతా విషాద వాతావరణం నెలకొంది. కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ హాజరై ఆజ్మీర బాల్య, సాయి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రమాదంలో తండ్రీకొడుకులు ఒకేసారి మృతి చెందడం గ్రామానికి తీరని లోటని పేర్కొన్నారు. వారి సేవలు, ప్రజలతో ఉన్న అనుబంధం, గ్రామ అభివృద్ధికి చేసిన కృషి ఎప్పటికీ మరువలేనివని ఆయన గుర్తుచేశారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఆజ్మీర బాల్య, సాయి మరణం తమ కుటుంబానికే కాకుండా బీఆర్ఎస్ పార్టీకి కూడా తీరని లోటని వారు పేర్కొన్నారు. పార్టీ కోసం, గ్రామ ప్రజల కోసం వారు చేసిన సేవలు ఎప్పటికీ స్మరణీయమని తెలిపారు. కార్యక్రమం మొత్తం భావోద్వేగ వాతావరణంలో సాగింది. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, విద్యాసాగర్, డీఎస్ బాలు నాయక్, చే రెడ్డి బిక్షం రెడ్డి,రాయల వెంకటేశ్వరావు,కాడెం బాబు,రామనబోయిన రాజు, కాడెం ప్రశాంత్, చీర్రా వీరభద్రం, తదితరులు పాల్గొన్నారు.



# నకిలీ ఆన్‌లైన్ షాపింగ్ ప్రకటనలపై అప్రమత్తంగా ఉండాలి

## జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఐపిఎస్



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 27,**
సంగారెడ్డి జిల్లా ప్రతినిధి: ఇంస్టాగ్రామ్, ఫేస్ బుక్, వాట్స్ అప్, టెలిగ్రాం వంటి సోషల్ మీడియా వేదికగా నకిలీ ఆన్‌లైన్ షాపింగ్ ప్రకటనల ద్వారా సైబర్ మోసాలు పెరుగుతున్నాయని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ తెలియజేశారు. సైబర్ నేరగాళ్లు బ్రాండెడ్ షూస్, ఎలక్ట్రానిక్స్, దుస్తులు, గ్యాడ్జెట్లు, లగ్జరీ వస్తువులను భారీ డిస్కౌంట్లతో అందిస్తున్నట్లు నకిలీ స్పాన్సర్ యాడ్స్ రూపొందించి ప్రజలను మోసం చేస్తున్నారని అన్నారు. బాధితులు ఆన్లైన్ చెల్లింపులు చేసిన తర్వాత వస్తువులు అందకపోవడం మాత్రమే కాకుండా, బాధితుల బ్యాంకింగ్, వ్యక్తిగత వివరాలు దుర్వినియోగానికి గురయ్యే ప్రమాదం కూడా ఉందన్నారు.ప్రజలు గుర్తుంచుకోవలసిన విషయాలు అసాధారణ డిస్కౌంట్లు మరియు ఫ్లాష్ సేల్, కాష్ ఆన్ డెలివరీ సౌకర్యం లేకపోవడం, కొత్తగా సృష్టించిన సోషల్ మీడియా పేజీలు, అనుమానాస్పద యు.ఆర్.ఎల్, నకిలీ వెబ్‌సైట్లు, తప్పుడు రివ్యూలు, ముందస్తుగా డబ్బు చెల్లించమని ఒత్తిడి చేయడం వంటివి సైబర్ నేరగాళ్ల పన్నిన మోసపూరిత కుట్ర అని గుర్తించాలన్నారు.

**సైబర్ మోసాల బారిన పడకుండా పాటించవలసిన సూచనలు:**
-ఆన్లైన్ పేమెంట్ చేసే ముందు వెబ్‌సైట్, యు.ఆర్.ఎల్, లను జాగ్రత్తగా పరిశీలించాలి.
-పేజీ హిస్టరీ, ఫాలోవర్స్ మరియు రివ్యూ లను పరిశీలించాలి.
-తెలియని స్పాన్సర్ యాడ్స్ పై క్లిక్ చేయకూడదు.
-సురక్షిత పేమెంట్ పద్దతిని మాత్రమే ఉపయోగించాలి
-ఓ.టి.పి లు, బ్యాంకింగ్ వివరాలు ఎవరికీ పంచుకోకూడదు.

ఆన్‌లైన్ షాపింగ్ సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండి, నకిలీ ప్రకటనలు మరియు మోసపూరిత వెబ్‌సైట్ల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్పీ సూచించారు. సైబర్ మోసాలకు గురైన వారు వెంటనే 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు కాల్ చేసిగాని, నేషనల్ సైబర్ క్రైమ్ పోర్టల్ లో గాని ఫిర్యాదు నమోదు చేయాలి.

# పేరుమండ్ల సంకీసలో ముత్యాలమ్మ తల్లి విగ్రహం ధ్వంసం

## గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు.. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని హిందూ సంఘాల డిమాండ్



**హైదరాబాద్ పల్స్, మే 27, మహబూబాబాద్ ప్రతినిధి:**
డోర్నకల్ మండలం పరిధిలోని పేరుమండ్ల సంకీస గ్రామం లో చోటుచేసుకున్న ముత్యాలమ్మ తల్లి విగ్రహం ధ్వంసం ఘటన స్థానికంగా తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. గ్రామ ప్రజల ఆరాధ్య దైవంగా భావించే ముత్యాలమ్మ తల్లి విగ్రహాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసినట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఉదయం ఆలయానికి వచ్చిన భక్తులు విగ్రహం ధ్వంసమైన దృశ్యాన్ని గమనించి తీవ్ర ఆవేదనకు గురయ్యారు. ఘటన సమాచారం గ్రామమంతా వ్యాపించడంతో ప్రజలు పెద్ద ఎత్తున ఆలయం వద్దకు చేరుకుని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలు, వృద్ధులు, యువకులు భక్తి భావాలతో పూజలు నిర్వహించే దేవాలయంపై దాడి జరగడం బాధాకరమని పేర్కొన్నారు ఈ ఘటనతో గ్రామంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఘటనపై స్పందించిన బీజేపీ నాయకులు, హిందూ సంఘాల ప్రతినిధులు దేవాలయం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా వ్యవహరించిన నిందితులను వెంటనే గుర్తించి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. మత విద్వేషాలకు కారణమయ్యే చర్యలను ప్రభుత్వం, పోలీసులు తీవ్రంగా పరిగణించాలని కోరారు. ఈ సందర్భంగా హిందూ భారతి నాయకులు మాట్లాడుతూ, ముత్యాలమ్మ తల్లి విగ్రహం ధ్వంసం హిందూ సమాజాన్ని తీవ్రంగా కలచివేసిందన్నారు. పవిత్ర ఆలయాలపై దాడులు జరుగుతున్నా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. గ్రామంలో శాంతి భద్రతలు కాపాడేందుకు వెంటనే ప్రత్యేక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అలాగే విగ్రహాన్ని ధ్వంసం చేసిన వ్యక్తి ఒక ముస్లిం సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిగా స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నట్లు నాయకులు పేర్కొన్నారు. అయితే ఘటనపై పూర్తి స్థాయి దర్యాప్తు జరిపి నిజానిజాలు వెలుగులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు. ఎలాంటి వర్గాల మధ్య విభేదాలు తలెత్తకుండా పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించాలని గ్రామ పెద్దలు సూచించారు.. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు వ్యాస్ లక్ష్మీనారాయణ, బాసాని లక్ష్మీనారాయణ, హనుమంతు, నాగరాజు, ఉపేందర్, అశోక్, కృష్ణారావు, ఉడుగుల శీను, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు మరోవైపు ధ్వంసమైన ముత్యాలమ్మ తల్లి గుడిని వెంటనే పునర్నిర్మించాలని గ్రామస్తులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఆలయానికి భద్రత కల్పించడంతో పాటు భక్తుల విశ్వాసాన్ని కాపాడేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు సమాచారం.

# నిరుద్యోగులకు తీపికబురు...
# త్వరలో భారీ ఉద్యోగాల జాతర!



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 27, తెలంగాణ బ్యూరో:**
తెలంగాణ రాష్ట్రంలోని నిరుద్యోగ యువతీ యువకులకు తీపికబురు. ఉద్యోగాల కోసం నిరీక్షిస్తున్న వారికి రాబోయే రోజుల్లో గొప్ప అవకాశం లభించనుంది. రాష్ట్ర ప్రభుత్వం వివిధ శాఖల్లో సుమారు 6,000 ఖాళీలను భర్తీ చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు త్వరలోనే సమగ్ర నోటిఫికేషన్ విడుదల చేయనుంది.

**వివిధ శాఖల్లో పోస్టులను భర్తీ చేయడానికి ప్రణాళికలు:**
ప్రభుత్వం ప్రస్తుతం వివిధ డిపార్ట్‌మెంటుల్లో ఖాళీగా ఉన్న పోస్టులను సమీక్షించే పనిలో ఉంది. గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-3, గ్రూప్-4 వంటి వివిధ స్థాయి ఉద్యోగాలు, అలాగే పోలీసు, వైద్య, విద్య, అడ్మినిస్ట్రేటివ్ శాఖల్లో ఖాళీలను భర్తీ చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ముఖ్యంగా యువతకు మంచి అవకాశాలు లభించేలా ప్రాసెస్‌ను వేగవంతం చేస్తున్నట్లు సమాచారం.

**గత లోపాలను దిద్దుకుని త్వరలో షెడ్యూల్**
ఈ ఉద్యోగ భర్తీ ప్రక్రియ ద్వారా రాష్ట్రంలోని విద్యార్థులు మరియు యువతీ, యువకుల ఆకాంక్షలను నెరవేర్చాలని ప్రభుత్వం భావిస్తోంది. నోటిఫికేషన్ వెలువడిన తర్వాత ఆన్‌లైన్ దరఖాస్తులు, పరీక్షల షెడ్యూల్‌ను స్పష్టంగా ప్రకటించనుంది. గతంలో జరిగిన ఉద్యోగ భర్తీలలో గమనించిన లోపాలను సరిద్దుకుని, మరింత పారదర్శకంగా మరియు వేగంగా ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులు యోచిస్తున్నారు.
నిరుద్యోగ యువత కోసం భారీ ఉద్యోగాల భర్తీ
అర్హతలు, వయోపరిమితి, రిజర్వేషన్ విధానాలు తదితర వివరాలు నోటిఫికేషన్‌లో స్పష్టంగా ప్రకటించనున్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ముఖ్యంగా గ్రామీణ యువత, మహిళలు, వెనుకబడిన వర్గాలు ఎక్కువగా లాభపడేలా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపనుంది. ఈ భారీ ఉద్యోగ భర్తీతో తెలంగాణలో నిరుద్యోగ సమస్య కొంతవరకు తగ్గుతుందని, యువతలో ఆశావాదం పెరుగుతుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

**వన్ టైమ్ రిజిస్ట్రేషన్ అప్డేట్ ముఖ్యం:**
నోటిఫికేషన్ విడుదలకు ముందు అభ్యర్థులు సిలబస్, పాత ప్రశ్నపత్రాలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. కొత్త నోటిఫికేషన్లకు దరఖాస్తు చేసుకోవాలనుకునే అభ్యర్థులందరూ తప్పనిసరిగా తమ వన్ టైమ్ రిజిస్ట్రేషన్ వివరాలను అప్‌డేట్ చేసుకోవాలని స్పష్టం చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో సుమారు 30 లక్షల మంది వన్ టైమ్ రిజిస్ట్రేషన్ నమోదు చేసుకున్నా, వారిలో కేవలం 12 లక్షల మంది మాత్రమే రెగ్యులర్‌గా దరఖాస్తులు చేస్తున్నారు. మిగిలిన అభ్యర్థులు వెంటనే వన్ టైమ్ రిజిస్ట్రేషన్ అప్‌డేట్ చేసుకోవాలని కమిషన్ సూచించింది.

# ఈసీ చేపడుతున్న ఎస్.ఐ.ఆర్ చట్టబద్ధమే.. సుప్రీంకోర్టు కీలక తీర్పు



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 27, సెంట్రల్ బ్యూరో:**
ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్.ఐ.ఆర్) విషయంలో కేంద్ర ఎన్నికల కమిషన్ కు భారీ ఊరట లభించింది. సర్‌పై దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు బుధవారం కీలక తీర్పు వెలువరించింది. దేశవ్యాప్తంగా ఎన్నికల సంఘం చేపడుతున్న సర్ చట్టబద్ధమేనని స్పష్టం చేసింది. ఓటర్ల జాబితా ప్రక్షాళనకు ఈసీ తీసుకుంటున్న చర్యలను సమర్థించింది. ఎన్నికల సంఘం చేపట్టిన ఈ ప్రక్రియ ఏ చట్టాన్ని లేదా రాజ్యాంగ నిబంధనలను ఉల్లంఘించలేదని సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించాలనే లక్ష్యంతో ఈసీ తీసుకున్న ఈ నిర్ణయం సరైందేనని కోర్టు స్పష్టం చేసింది.సర్‌కు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్లపై చీఫ్ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్ మాల్య బాగ్చీలతో కూడిన ధర్మాసనం బుధవారం విచారణ జరిపింది. ఈ సందర్భంగా ఈసీ చర్యను ధర్మాసనం సమర్థించింది. ఖచ్చితమైన, సమగ్రమైన ఓటర్ల జాబితా రూపకల్పనకు సర్ ఒక ముందడుగు అని వ్యాఖ్యానించింది. ఈ ప్రక్రియ ఎన్నికల పారదర్శకతను బలోపేతం చేసేందుకు ఉద్దేశించినదని, ఇది ప్రజాప్రాతినిధ్య చట్టానికి జీవం పోస్తుందని పేర్కొంది.ఎస్.ఐ.ఆర్ ను నిర్వహించడం ద్వారా కేంద్ర ఎన్నికల సంఘం తన చట్టబద్ధమైన అధికారాల పరిధిని దాటి ప్రవర్తించలేదని కోర్టు స్పష్టం చేసింది. 'సాధారణంగా నిర్వహించే ప్రక్రియ కంటే ఇది భిన్నంగా ఉన్నంత మాత్రాన.. దీనిని చట్టవిరుద్ధం అనలేము' అని కోర్టు అభిప్రాయపడింది. సర్‌లో పేరు లేనంత మాత్రాన పౌరసత్వం కోల్పోరని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. ఈ మేరకు బీహార్ సహా ఇతర రాష్ట్రాల్లో నిర్వహించిన 'ఠ×=' ప్రక్రియను సవాల్ చేస్తూ దాఖలైన వరుస పిటిషన్లపై కోర్టు ఈ తీర్పు ఇచ్చింది.తీర్పు సందర్భంగా 'ఎస్.ఐ.ఆర్' పై నెలకొన్న వివాదాలను సుప్రీంకోర్టు నాలుగు ప్రశ్నలుగా విభజించింది. ఈ ప్రక్రియను నిర్వహించే అధికారం కేంద్ర ఎన్నికల సంఘానికి ఉందా..?, ఈ ప్రక్రియ తగిన నిష్పత్తిలో మరియు చట్టబద్ధంగా సమర్థించదగినదేనా..?, ఇది 1950 నాటి ప్రజాప్రాతినిధ్య చట్టాన్ని ఉల్లంఘించిందా..?, ఓటర్ల జాబితాలో చేర్చడం కోసం పౌరసత్వాన్ని ఎన్నికల సంఘం పరిశీలించవచ్చా..? వంటి ప్రశ్నల ఆధారంగా ఈసీకి అనుకూలంగా సుప్రీం ధర్మాసనం తీర్పు చెప్పింది. సుప్రీంకోర్టు ఇచ్చిన ఈ తీర్పుతో 'ఎస్.ఐ.ఆర్' చుట్టూ ఏడాది కాలంగా సాగుతున్న వివాదానికి తెరపడినట్లైంది.



# ఆటో - బైక్ ఢీ..
# ఒకరు అక్కడికక్కడే మృతి

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 27, మొగుడంపల్లి: సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గం**
చిరాగ్‌పల్లి పోలీస్ పరిధిలోని గోవింద్‌పూర్ గ్రామ శివారులో బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరో నలుగురు గాయపడ్డారు. మొగుడంపల్లి మండలం రాయిపల్లి తండా గ్రామానికి చెందిన ఆటో జహీరాబాద్ వైపు వెళ్తుండగా ఎదురుగా వచ్చిన బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న కర్ణాటక రాష్ట్రం చించోలి తాలూకా చంద్రంపల్లి గ్రామానికి చెందిన వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదంలో గాయపడిన నలుగురిని స్థానికులు వెంటనే జహీరాబాద్ ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని పరిశీలించారు. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# వరి, జొన్నలు తొందరగా కొనుగోలు చేయాలని నిరసనకు దిగిన రైతన్నలు

## రాజకీయాల కోసం రైతులను గోసపెడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 27, నారాయణ ఖేడ్ :**
సిర్గాపూర్ మండలం బోక్కాస్ గామా గ్రామానికి చెందిన రైతులు తాము పండించిన వరి మరియు జొన్న పంటను నెలలు గడుస్తున్న కొనుగోలు చేయడం లేదని నిరసన వ్యక్తం చేశారు. గత పదిహేను సంవత్సరాల నుండి మా వద్ద ఉన్న పి ఏ సి యస్ సొసైటీ (బొక్కస్ గామా) ద్వారా మా పంటలను ఇటువంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు చేసేవారని సకాలంలో పంటలు కొనుగోలు చేసి డబ్బులు తమ ఖాతాలో జమ చేసి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉండేవని ఈ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఈ ఎమ్మెల్యే కావాలని సొసైటీ పైన లేనిపోని అబండాలు వేసి కేంద్రాలను నిలిపివేసి రైతులను ఇబ్బందులకు గురిచేసి వారు ప్రశ్నిస్తే నిన్న మొన్న ఐకెపి కేంద్రాలను ఏర్పాటు చేశారు. వాటి ద్వారా కొనుగోలు సక్రమంగా జరగడం లేదని మాకు ఇంతకముందు సొసైటీ ద్వారా కొనుగోలు కేంద్రాలు ఉన్నప్పుడే బాగుండే అని తెలిపారు. ఈ విషయంపై విచారం జరపడానికి అక్కడికి వచ్చిన నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ని రైతులు తమకు ఐకెపి సెంటర్ వద్దు పి ఏ సి యస్ సొసైటీ సెంటర్ కావాలని తమ బాధలను వివరించుకునే ప్రయత్నం చేశారు. ఆ సమయంలో అక్కడ వారి బాధలు పట్టకుండా పోలీసులు రైతులపై లాఠీచార్జ్ జపారు. సబ్ కలెక్టర్ ఎటువంటి సమాధానం ఇవ్వకుండా వెనుతిరిగారు. మా పి ఏ సి యస్ సొసైటీ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేసి రైతుల బాధలు తీర్చాలని రైతులు ప్రభుత్వానికి సభ కలెక్టర్ కి డిమాండ్ చేస్తున్నారు.

# సీఎం పర్యటన ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ హరిత అధికారులకు ఆదేశం



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 27, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:**
జూన్ 1న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా పర్యటన నేపథ్యంలో అవసరమైన ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా ఎస్పీ నితికా పంత్, అదనపు కలెక్టర్లు, సబ్ కలెక్టర్, డీఎస్పీ తదితర అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కెరమెరి మండలం కొఠారి గ్రామంలో ఇందిరమ్మ నివాస గృహాల ప్రారంభోత్సవం, లబ్ధిదారులతో భోజనం, ముఖాముఖి కార్యక్రమాలు జరుగనున్నాయి. హెలిపాడ్ ఏర్పాట్లు, షామియానాలు, పార్కింగ్, పారిశుద్ధ్యం, త్రాగునీరు, నిరంతర విద్యుత్ సరఫరా, రహదారి గుంతల పూడ్పు చేపట్టాలని సూచించారు. సాయంత్రం కాగజ్‌నగర్ ఎక్స్ రోడ్డు వద్ద బహిరంగ సభకు వచ్చే ప్రజలకు త్రాగునీరు, వైద్య బృందాలు, అంబులెన్స్ అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.మే 29న గవర్నర్ రెబ్బెన మండలం రౌతు సంకెపల్లి పర్యటన నేపథ్యంలో హెలిపాడ్ వద్ద అంబులెన్స్ కాన్వాయ్, పోలీసు గౌరవ వందన కార్యక్రమాలు సిద్ధంగా ఉంచాలని కలెక్టర్ తెలిపారు.

## రైతులు, హమాలీలకు
# మజ్జిగ పంపిణీ చేసిన మార్త జయశ్రీ జగదీశ్వర్

**రైతులు కష్టజీవుల గురించి నిత్యం కొద్ది సమయం ఆలోచిస్తా**
**నా జీవితకాలం రైతుల బాగు కోసం కృషి చేస్తా**
**సామాజిక చైతన్య వేదిక కన్వీనర్ మార్త జగదీశ్వర్**



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 27, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** బుధవారం పెళ్లిరోజు పురస్కరించుకొని రైతులు హమాలీలతో గడిపిన రాజపేటకు చెందిన సామాజిక చైతన్య వేదిక కన్వీనర్ మార్త జయశ్రీ జగదీశ్వర్ లు అందరికీ ఆదర్శంగా నిలిచారు. బుధవారం రాజపేటకు చెందిన సేవా ఆధ్యాత్మిక కార్యక్రమంలో ముందుండే సామాజిక చైతన్య వేదిక కన్వీనర్ మార్త జయశ్రీ జగదీశ్వర్ పెళ్లిరోజు సందర్భంగా రేణికుంట రాజపేట, నరసాపురం గ్రామాల పరిధిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద హమాలీలు రైతులకు మజ్జిగను స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా మార్త జగదీశ్వర్ మాట్లాడుతూ.... రైతులు కష్టజీవుల గురించి నిత్యం కొద్ది సమయం ఆలోచించి అవసరమైన సహాయ సహకారాలు అందించనున్నట్లు చెప్పారు. ప్రస్తుతం పట్టిపీడిస్తున్న కోతుల సమస్య పరిష్కారం కోసం ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, తహసిల్దార్, ఎంపీడీవో, ప్రముఖ కవి సిద్ధిరెడ్డి పలువురికి వినతి పత్రాలు అందజేసినట్లు సమస్య పరిష్కారం అయ్యేవరకు తన పోరాటం ఆగదని చెప్పారు.



కోతుల వల్ల రైతులకు ప్రజలకు ప్రతి ఒక్కరికి ఇబ్బందులు నష్టాలు కలుగుతున్నాయని చెప్పారు. వివాహ దినోత్సవ వేడుకలు రైతన్నల మధ్య జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. తమ జీవితకాలం రైతుల బాగుకోసం కృషి చేయనున్నట్లు తండ్రి మార్త వాసుదేవ్ ఆశయ సాదనకై తల్లి సిద్ధమ్మ, అన్న వెంకటేశం ల ప్రోత్సాహంతో రైతుల శ్రేయస్సు కోసం శ్రమిస్తున్నట్లు చెప్పారు. జగదీశ్వర్ జయశ్రీ దంపతులను అభినందిస్తూ పెళ్లిరోజు శుభాకాంక్షలు చెబుతూ రేణికుంట గ్రామానికి చెందిన బూర్గు నర్సిరెడ్డి చేనేత శాలువాతో సత్కరించారు. జర్నలిస్టులు సైతం జగదీశ్వర్ జయశ్రీ ల సేవలను అభినందించారు.

# రాజపేట మండలంలో గంటపాటు ప్రకృతి బీభత్సం....

**కూలిన విద్యుత్ స్తంభాలు, విరిగిన చెట్లు....**
**తడిసిన వరి ధాన్యం, నేల రాలిన మామిడి .....**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 27, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రాజపేట మండలంలో ఒక గంట పాటు చేసిన ప్రకృతి బీభత్సం... రైతులు ప్రజలకు ఆర్థిక నష్టాన్ని తెచ్చిపెట్టింది. మంగళవారం రాత్రి 10 గంటల నుండి 11 గంటల వరకు ఉరుముల మెరుపులతో భారీ ఈదురు గాలుల వర్షం... మామిడి రైతులకు, వరి సేద్యం చేసిన అన్నదాతలకు, పాడి రైతులకు రెండు కోట్ల రూపాయలకు పైగా నష్టాన్ని తెచ్చిపెట్టింది.




ధాన్యం కొనుగోలు కేంద్రాలలో సుమారు 1000 ధాన్యం రాశులు, 50వేల ధాన్యం బస్తాలు తడిసి ముద్దయ్యాయి. 25 తోటలల్లో మామిడి చెట్లకున్న కాయలు నేలరాలి కోటి రూపాయలకు పైగా నష్టాన్ని తెచ్చిపెట్టింది. పలు గ్రామాల్లో విద్యుత్తు స్తంభాలు విరిగిపోయి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. పరిస్థితిని బట్టి చూస్తే విద్యుత్తు పునరుద్ధరణ కోసం 24 గంటల సమయం పట్టే పరిస్థితులు కనిపిస్తున్నాయి. కొన్ని చోట్ల ఇంటి పైన ఉన్న రేకులు విరిగిపోవడం, ఎగిరిపోవడం జరిగింది. వందకు పైగా చెట్లు విరిగి ప్రమాదాన్ని తెచ్చిపెట్టాయి. కొన్నిచోట్ల కారు, ట్రాక్టర్, ద్విచక్ర వాహనాలపై చెట్లు విరిగిపడ్డాయి. రోడ్డుమీద చెట్లు విరిగి పడిపోవడంతో కొన్నిచోట్ల రాకపోకలకు ఇబ్బందులు అయ్యాయి. నర్సాపురం రెవెన్యూ పరిధిలోని నమిల శ్రీహరి మామిడి తోటలోని 5 ఎకరాల స్థలంలోని మామిడి చెట్లకు ఉన్న కాయలన్నీ నేలరాలిపోవడంతో లక్షల రూపాయల్లో నష్టం వాటిల్లింది. నేలపై







మామిడి కాయలు పరిచినట్లుగా కాయలన్నీ రాలిపోవడంతో శ్రీహరి కంటనీరు పెట్టుకుని ఆందోళన చెందాడు. వెంటనే సర్వే చేపట్టి నష్టపరిహారం అందేలా చూడాలని, కొనుగోలు కేంద్రాల్లోని తడిసిన ధాన్యం ను ఎలాంటి షరతులు లేకుండా కొనుగోలు చేయాలని, ప్రకృతి బీభత్సం వల్ల జరిగిన నష్టాన్ని అంచనా వేసి నష్ట పరిహారం అందజేసి ఆదుకోవాలని పలువురు డిమాండ్ చేశారు. కాగా మామిడి తోటల నష్టం పై ప్రత్యక్షంగా సర్వే చేసేందుకు సంబంధిత అధికారులు రాకపోవడం పట్టించుకోకపోవడం స్పందించకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు సైతం కనిపించకపోవడం పట్ల అసహనం చెందుతున్నారు.



# ప్రకృతి కన్నెర్ర నర్సాపురంలో అతలాకుతలం







**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 27, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** గతంలో ఎన్నడూ లేని విధంగా రాజపేట మండలం నర్సాపురం గ్రామంలో 20 విద్యుత్తు స్తంభాలు, పదికి పైగా రోడ్డు పక్కన చెట్లు విరిగిపోయాయి. మంగళవారం రాత్రి గంటపాటు ఈదురు గాలుల ఉరుముల మెరుపుల వర్షం కారణంగా ఈ బీభత్సం జరిగింది. దీంతోపాటు పరిసర ప్రాంతాల్లోని మామిడి తోటలో మామిడికాయలు నేలరాలిపోవడం, విద్యుత్తు సరఫరా నిలిచిపోవడం లాంటి విపత్కర సంఘటనలు చోటుచేసుకున్నాయి. బుధవారం ఉదయం సర్పంచ్ ఎమ్మా శిరీష నాగరాజు ఉపసర్పంచ్ వార్డు సభ్యులు పంచాయతీ కార్యదర్శి గ్రామ పెద్దలు యువకులు దిద్దుబాటు చర్యలు సహాయక చర్యలు ముమ్మరం చేశారు. సంబంధిత విద్యుత్తు పోలీసు రెవెన్యూ శాఖల అధికారులకు సర్పంచ్ సమాచారం అందించడంతో గ్రామంలో సహాయక చర్యలు వేగంగా జరిగాయి. రోడ్డుపైన విరిగిన చెట్లను ప్రత్యేక జెసిబి తో తొలగించడం చేశారు. విరిగిన విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్త వాటిని ఏర్పాటు కోసం సంబంధిత విద్యుత్ శాఖ అధికారులు పనులు చేపట్టారు. 12 గంటల్లో విద్యుత్తు సరఫరా కొనసాగించేందుకు అధికారులు కార్యాచరణ చేపట్టారు. సర్పంచ్ బృందం ఉదయం నుండి రాత్రి వరకు గ్రామంలో సహాయక చర్యలు సేవా కార్యక్రమాలను కొనసాగిస్తూ వచ్చారు. ఇతర పార్టీల వారు సైతం గ్రామ పాలకవర్గం చేపడుతున్న చర్యల పట్ల అభినందనలు తెలిపారు. గతంలో ఎన్నడు లేని విధంగా ప్రకృతి కన్నెర్రతో నరసాపురం గ్రామంలో తీవ్ర నష్టం జరగడంతో పాటు ప్రజలకు ఇబ్బందులు ఎదురయ్యాయి. సర్పంచి, గ్రామపంచాయతీ పాలకవర్గం దగ్గరుండి చేపడుతున్న సేవల పట్ల ఇతర గ్రామస్తులు సైతం ప్రశంసించారు.

# ఉపాధి హామీ కొత్త చట్టంతో కార్మికులకు ఇబ్బందులు....

**వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కట్ట రవి కుమార్**



హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 27, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : రాజపేట మండలం పారుపల్లి గ్రామంలో ఉపాధి కూలీలతో మంగళవారం రాజపేట వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కట్ట రవి కుమార్ మాట్లాడారు. ఈ సందర్భంగా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గతంలో ఉన్న చట్టం ద్వారా ఉపాధి కూలీలకు సౌకర్యాలని కల్పించే పరిస్థితి ఉన్నదని, దాంతోపాటు కొత్త చట్టం ద్వారా ఫేస్ ఫోటో బయోమెట్రిక్ ద్వారా పొద్దున మధ్యాహ్నం నాలుగు గంటలకు ఒకసారి ఫేస్ ఫోటో తీయడం ద్వారా ఉపాధి కూలీలకు కొంత మందికి ఫోటో రాకపోవడంతో ఇబ్బందులు కలుగుతున్నాయి అన్నారు. కొత్త చట్టం వీబీజి రాంజీ చట్టం ద్వారా కూలీలకు చాలా ఇబ్బంది జరుగుతుందని వెంటనే రద్దు చేయాలని పాత పద్ధతిలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పని కొనసాగించాలని అధికారులు ఆయా గ్రామాలకు సందర్శించి సౌకర్యాలను కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో లలిత, రాగుల బాలరాజు బండారి రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో ఇంటర్ విద్యార్థులకు బ్రేక్ ఫాస్ట్ మెనూ ఇదే..



తెలంగాణలో ఇంటర్ విద్యార్థులకు సంబంధించిన బ్రేక్ ఫాస్ట్ స్కీమ్ ఈ ఏడాది నుంచి అమలు చేయనున్నారు. ఈ బ్రేక్ ఫాస్ట్ విధానానికి సంబంధించిన మెనూ విడుదలైంది. మెనూలో బోండా, దోశ, పూరీ, మిల్లెట్ ఇడ్లీ, ఉప్మా ఉన్నాయి. రోజుకో వంటకాన్ని విద్యార్థులకు ఇవ్వనున్నారు. జూన్ 12న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ పథకాన్ని ప్రారంభించనున్నారు. విద్యార్థులకు సరైన పోషకాలు అందించేలా మెనూను రూపొందించారు.ఈ ఫలహారాలలోకి చట్నీ, సాంబార్, మిక్స్ వెజిటెబుల్ కుర్మా వంటివి అందించనున్నారు. ఇంటర్ విద్యార్థులకు బలవర్ధక ఆహారాన్ని అందించేందుకు ఈ బ్రేక్ ఫాస్ట్ విధానాన్ని ఈ సంవత్సరం నుంచి ప్రారంభిస్తున్నారు. ఈ పథకం కోసం ప్రతి సంవత్సరం రూ.120 కోట్లను ప్రభుత్వం ఖర్చు చేస్తుంది. బ్రేక్ ఫాస్ట్ పథకం కింద రాష్ట్రంలోని 1.92 లక్షలమంది ఇంటర్ విద్యార్థులకు ప్రయోజనం కలగనుంది.ఇప్పటి వరకు దేశవ్యాప్తంగా పాఠశాల విద్యార్థులకు మాత్రమే మధ్యాహ్న భోజన పథకాన్ని ఆయా రాష్ట్రాల్లో అమలు చేస్తున్నారు. కానీ తెలంగాణలో ఇంటర్ విద్యార్థులకు కూడా మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తున్నారు. మధ్యాహ్న భోజనంతో పాటు బ్రేక్ ఫాస్ట్ కూడా ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకోవడంతో, దీనిని ఈ సంవత్సరం నుంచి అమలు చేయనున్నారు.

# ప్రభుత్వం ప్రతి గింజ ధాన్యాన్నీ కొనుగోలు చేస్తుంది ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 27, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించారు. మంగళవారం రాత్రి కురిసిన అకాల వర్షాలకు కొనుగోలు కేంద్రంలో నిల్వ ఉంచిన ధాన్యం తడవడంతో రైతులు ఆందోళనకు గురయ్యారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వెంటనే కొనుగోలు కేంద్రానికి చేరుకుని రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తడిసిన ధాన్యాన్ని స్వయంగా పరిశీలించిన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు రైతులు ఎలాంటి అధైర్యానికి గురికావద్దని, ప్రభుత్వం రైతుల పక్షాన నిలబడి ప్రతి గింజ ధాన్యాన్ని కొనుగోలు చేస్తుందని భరోసా ఇచ్చారు. అకాల వర్షాల వల్ల రైతులు ఎన్నో కష్టాలు పడుతున్నారని, రైతు శ్రమ వృథా కాకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి ఆలస్యం జరగకుండా వెంటనే అదనపు లారీలను ఏర్పాటు చేసి ధాన్యాన్ని తరలించే చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు. అదేవిధంగా నూతనంగా వంగపల్లి గోదాములో ధాన్యాన్ని నిల్వ చేసేందుకు వేసులు బాటు కల్పించడం జరిగిందని లారీ కాంట్రాక్టర్ తో మాట్లాడి బొమ్మలరామారం తుర్కపల్లి మండలం లో ఉన్న ధాన్యాన్ని అదనపు లారీలతో లోడ్ చేసి వంగపల్లి గోదాంలో అన్లోడ్ చేయవలసిందిగా తెలిపారు. రైతులు రోజులు తరబడి కొనుగోలు కేంద్రాల వద్ద నిరీక్షించాల్సిన పరిస్థితి రాకూడదని, ధాన్యం త్వరితగతిన కొనుగోలు చేసి మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు. రైతుల ధాన్యం కొనుగోలు ప్రక్రియలో గోదాం వద్ద అన్లోడ్ విషయంలో ఏ అధికారి అయినా ఏ కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వహించిన చర్యలు తప్పవని తెలిపారు. వర్షాలకు తడిసిన ధాన్యం విషయంలో కూడా



రైతులకు ఎటువంటి అన్యాయం జరగకుండా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రైతులు ఎమ్మెల్యేకి తమ సమస్యలను వివరించగా, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రైతు సంక్షేమమే



ప్రభుత్వ లక్ష్యమని, రైతులు నష్టపోకుండా అన్ని విధాలుగా అండగా ఉంటామని ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య తెలిపారు


Edited, Published and Owned by Konadoddi Naveen Kumar and Printed at Srinith Publications Falcon Printing Press #1-2-201, Shop No.02, Khan Street Zaheerabad 502220.T.G. And Published from #1-2-201, Shop No.02, Khan Street Zaheerabad 502220.T.G. Editor's Konadoddi Naveen Kumar, Dr.Tadhkal Rahul Kumar Reg. No.TEL-TEL/2023/12249. Email.HyderabadPulse23@gmail.com, Web:www.HyderabadPulse.com, Cell: +91-94406 53413, +91-9989834020.